నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 24-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93• Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:247 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

జీమ్నాస్టిక్సున స్వర్ణము
జీమ్నాస్టిక్సున రజతము చేజిక్కగ ప్ర
త్యామ్నాయము నెరుగని క్రీ
డామ్నాయ మనంగ దేశ మాదరణ గొనెన్ !!

(జీమ్నాస్టిక్సులో భారత దేశం స్వర్ణం రజతం గెలిచి వ్యాయామ క్రీడలలో తనకు ఎదురే లేదని ప్రపంచానికి చాటి చెప్పి ప్రపంచ ప్రశంసలను అందుకున్నది.)

-రాధశ్రీ
సెల్:9494481210

రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల
రాజకీయ హామీలు
అమలు పూర్తి కాకుండా
అబద్ధాల సునామీలు.
పార్టీలు సచ్చినట్లు
పడిఉండక సవాళ్లు
ప్రలోభాల్లో వంచిస్తరు
ప్రజలనింకా ఎన్నేళ్లు.

మరక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మెట్రో స్వాధీనం, విస్తరణకు గ్రీన్ సిగ్నల్.

– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్చలు సఫలం

హైదరాబాద్, జూన్ 23: హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్య మంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమం త్రులతో జరిపిన వరుస సమా వేశా లు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్త రణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆట ంకాలు ఈ చర్చలతో తొలగి పోయాయి.

40 నిమిషాల పాటు సంయుక్త సమావేశం..

ఈరోజు (మంగళవారం) ఉ దయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనో హర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదా పు 40 నిమిషాల పాటు ఉన్నత స్థాయి సంయుక్త సమావేశం జరిగిం ది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్ (రైల్వే శాఖ), జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు.

కన్సల్టెంట్‌గా SBICAPS' ఎంపిక.. విధివిధానాలు ఇవే..

మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లే ందుకు ప్రతిష్టాత్మక ఆర్థిక సలహా సంస్థను SBICAPS' (SBI Capital Markets) కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అం శాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది.

ఫేజ్-1 వాల్యూయేషన్: ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్య ంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ (వాల్యూ యేషన్) రుణ సేకరణపై 'SBICAPS' రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది.

ఫేజ్-2 నివేదిక: ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల ని ర్మాణ వ్యయం ఎంత అవుతుంది.. నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి.. అనే అంశాలపై నివేదిక అంది స్తుంది.

ప్రభుత్వాల నిర్ణయం: ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి.

ప్రక్రియను వేగవంతం చేసేందుకు 'సమన్వయ కమిటీ'

కేంద్ర మార్గదర్శకాలకు అనుగు ణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేంద్రప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమ తుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షి స్తుంది. ఈ పరిణామంతో హైదరా బాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది.

నటుడి పార్టీ అని మమ్మల్ని ఎంతో మంది ఎగతాళి చేశారు : తమిళనాడు సీఎం

తమిళనాడు, జూన్ 23: తమిళనాడు అసెంబ్లీ లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ తొలి ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా త్రిభాషా సూత్రం, నీట్ వివాదం , కరూర్ తొక్కిసలాట ఘటన తదితర అంశాలను ప్రస్తావించారు. ఈ ప్రసంగం ద్వారా విజయ్ విమర్శకు లకు గట్టిగా బదులిచ్చారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారం లోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు. తమకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదని, తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు తాను, తన పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చిందని చెప్పారు.

తమది యాక్టర్ పార్టీ అని, తాను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారని విజయ్ వెల్లడించారు. అయితే అలాంటి విమర్శలను తాను పట్టించుకోనని అన్నారు. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారని, కానీ తాను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశానని, తనపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ తెలిపారు. నీట్ వివాదంపై మాట్లాడుతూ.. నీట్ విధానం విద్యా వ్యవస్థలో అసమానతలను సృష్టిస్తోందని, దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తమిళనాడులో త్రిభాషా సూత్రాన్ని అమలు చేయబోమని, ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నామని సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. '41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన తనను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేనని అన్నారు. ఆ బాధ తనను ఎన్నటికీ వదలదని చెప్పారు. తొక్కిసలాట ఘటన విషయంలోనూ తమపైనే నిందలు వేశారని, ఇది అత్యంత దారుణమని అన్నారు.

రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయని సీఎం విజయ్ ఆవేదన వ్యక్తంచేశారు. వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కేవలం ఒక కుటుంబానికే (డీఎంకేను ఉద్దేశిస్తూ) ప్రాధాన్యమివ్వడం తమ రాజకీయ విధానం కాదన్నారు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి తాము సేవలు అందిస్తామని, అదే తమ రాజకీయం, అదే తమ పాలనా విధానం అని విజయ్ చెప్పారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం ముఖ్యం

–సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

నల్గొండ, జూన్ 23: మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం (జూన్ 26) సందర్భం గా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం అనంతగిరి మండల పరిధిలోని అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ యు వత దేశాభివృద్ధికి కీలక వనరులుగా ఎదగాలని సూచిం చారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని, గొప్ప వ్యక్తుల జీవితాల ను ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

విద్యార్థులు, యువత దేశ సంపద అని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారు నేరాలకు పాల్పడటంతో పాటు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని హెచ్చరించారు.

జిల్లాలోని అన్ని కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగం, రవాణా, సరఫరాపై సమాచారం అందించి నిర్మూలనకు సహకరిం చాలని కోరారు. డ్రగ్స్‌కు బానిసైన విద్యార్థులు, యువత గురించి సమాచారం అందిస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తీసుకురా వడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలు ప్రస్తుతం సమాజంలో పెద్ద సవాలుగా మారాయని ఎస్పీ పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు, పిన్ నంబర్లు చెప్పవద్దని సూచించారు. ఉచితాలు, బహుమతుల పేరుతో మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిం చారు.అలాగే రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు వాహనాలను వేగంగా నడపకూడదని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, బైక్ రేసులకు దూరంగా ఉండాలని సూచించారు.

అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్, జూన్ 23: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈరోజు(మంగళవారం) జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు.

ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని సీతక్క ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

తండ్రి, కుమారుడిపై దారుణ దాడి

–దర్యాప్తు చేస్తున్న కృష్ణలంక పోలీసులు

అమరావతి, జూన్ 23: విజయవాడ కృష్ణలంకలో సోమవారం రాత్రి బ్లేడ్ బ్యాచ్ వీరంగం సృష్టించింది. కరకట్టపై శిశుభవన్ సమీపంలో ఓ కుటుంబానికి చెందిన తండ్రి, కుమారుడిపై దుండగులు బ్లేడ్‌లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంకకు చెందిన భాను, ఆయన కుమారుడిపై చెక్క కుమార్ అనే వ్యక్తి బ్లేడ్‌తో దాడి చేసినట్లు సమాచారం.

ఈ దాడిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, ముఖ్యంగా బాలుడి గొంతు భాగంలో తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని స్థానికులు వెంటనే కృష్ణలంకలోని శ్రీరామ్ ఆసుపత్రికి తరలించారు. అయితే గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం వారిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి (జీజీహెచ్) తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. ఘటనకు గంజాయి మత్తులో తిరిగే బ్లేడ్ బ్యాచ్ సభ్యులే కారణమన్న ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

ఏపీ ఉద్యోగులకు డబుల్ ధమాకా.. రిటైర్మెంట్ వయసు పెంపు, 11 వేల మందికి OPS

అమరావతి, జూన్ 23: ఆంధ్రప్రదేశ్‌లో 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర కేబినెట్ శుభవార్త చెప్పింది. ఈరోజు(మంగళవారం) ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, సొసైటీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంపుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, మెమో-57 ప్రకారం 2004 సంవత్సరానికి ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ నుంచి పాత పెన్షన్ విధానం అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో ఉద్యోగ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోండి..

–కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు తుమ్మల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూన్ 23: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి కలిశారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్రమంత్రికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేసిన వెంటనే స్పందించి.. ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజిబులిటీ సర్వే చేసినందుకు రామ్మోహన్ నా యుడికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఫీజిబులిటీ సర్వేలో ప్రతిపాదిత స్థలం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేసినట్లు చెప్పారు.అక్కడ త్వరగా ఫీజిబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రికి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయో ధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిం దని ఈ సందర్భం గా కేంద్ర మం త్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

లక్నో కోచింగ్ సెంటర్ కూల్చివేతకు నోటీసులు

లక్నో, జూన్ 23: ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఓ కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 15 మంది సజీవదహనమైన విషయం తెలిసిందే. నగరంలోని అలీగంజ్ ఏరియాలో ఉన్న ఆ మూడు అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు లక్నో డెవలప్మెంట్ అథారిటీ కూల్చివేత ఆదేశాలు జారీ చేసింది. రెసిడెన్షియల్ బిల్డింగ్ పేరుతో ఉన్న ఆ భవనంలో కమర్షియల్ స్పేస్‌ను ఎలా నిర్మించాలని అధికారులు ఆరా తీస్తున్నారు. లక్నో మున్సిపల్ అధికారులపైన కూడా చర్యలు తీసుకునేందుకు ఉ న్నతాధికారులు సిద్ధమయ్యారు. వాస్తవానికి ఆ బిల్డింగ్‌ను కూల్చివేయాలని 2016లో ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేని నిర్మాణంగా భావిస్తూ ఆ ఆదేశాలు ఇచ్చారు. కానీ రెండు నెలల్లోనే మళ్లీ ఆ ఆదేశాలను వెనక్కి తీసుకున్నారు.

అలీగంజ్ బిల్డింగ్ కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చినట్లు ఎల్‌డీఏ వైస్ చైర్మెన్ ప్రథమేశ్ కుమార్ తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం పట్ల దర్యాప్తు చేపట్టామని, త్వరలో చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఆ బిల్డింగ్‌లో ఉన్న యానిమేషన్ సెంటర్‌లో కోర్సులు నేర్చుకునేందుకు భారీ సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారు. అగ్నిప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు ప్రభుత్వ ఏర్పాటు చేసిన సిట్ బృందం ఇవాళ ఉదయం ఆ ప్రదేశానికి చేరుకున్నది.

సీఎం యోగి ఆదేశాల మేరకు సిట్ బృందం దర్యాప్తు చేపడుతోంది. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు చెందిన ఆరు మంది సిబ్బంది ఇవాళ ఆ బిల్డింగ్ వద్ద ఆధారాలు సేకరించారు. అగ్నిప్రమాదం దేని వల్ల జరిగిందో, బాధ్యులు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

అతిపెద్ద మెస్సీ విగ్రహం ఆవిష్కరణ

–వరల్డ్‌కప్ విజయ క్షణానికి శిల్పరూపం

న్యూ ఢిల్లీ, జూన్ 22:ఫుట్‌బాల్ ప్రపంచాన్ని తన ఆటతో మంత్రముగ్ధులను చేసిన అర్జెంటీనా దిగ్గజం లియోనెల్ మెస్సీ కు మరో అరుదైన గౌరవం దక్కింది. అర్జెంటీనాలోని కట్రల్ కో నగరంలో ఏకంగా 85అడుగుల ఎత్తైన భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం ఈ విగ్రహానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ప్రపంచకప్‌ను అర్జెంటీనాకు అందించిన చారిత్రాత్మక క్షణాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని ప్రముఖ శిల్పి ఆల్డో బెరోయిసా రూపొందించారు. చేతిలో ప్రపంచకప్ ట్రోఫీని ఎత్తిపట్టుకుని అభిమానులను అభివాదం చేస్తున్న మెస్సీ రూపాన్ని అద్భుతంగా మలిచారు.

భారీ ఎత్తు, కళాత్మక రూపకల్పన, మెస్సీ విజయగాథను ప్రతిబింబించే తీరు కారణంగా ఈ నిర్మాణం ఇప్పుడు అంతర్జాతీయ పర్యాటక ఆకర్షణగా మారుతోంది. ఫుట్‌బాల్ అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు.

2022 ప్రపంచకప్ విజయంతో అర్జెంటీనా ఫుట్‌బాల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మెస్సీకి ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అనేక గౌరవాలు లభించాయి. అయితే 85 అడుగుల విగ్రహం మాత్రం ప్రత్యేక గుర్తింపును సంపాదించింది.

సోషల్ మీడియాలో అభిమానులు "ఫుట్‌బాల్ కింగ్‌కు తగిన గౌరవం", "మెస్సీ లెజెండ్‌కు మహా నివాళి" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

వితంతువులకు గౌరవ మర్యాదలు, సమన్యాయం, ఆర్థిక భద్రత కల్పించాలి

– లయన్: కెప్టెన్: డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్, కాలమిస్ట్

హైదరాబాద్, జూన్ 23:భర్త అకాల మరణ విషాదంలో మానసిక క్షోభను అనుభవిస్తున్న వితం తువులకు కనీస మానవ హక్కులు కల్పించడంలో పౌర సమాజం విఫలం అవుతున్న తరుణంలో ఆ అభాగ్య ఒంటరి మహిళలకు గౌరవ మర్యాదలు, సమ న్యాయం, ఆర్థిక భద్రతలను అందించడం ప్రభు త్వాల, పౌర సమాజ బాధ్యత అని ప్రముఖ కవి, కాలమిస్ట్, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్: కెప్టెన్: డాక్టర్॥ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు కరీంనగర్ సఖీ కేంద్రం, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ వైధవ్యం పొందిన మహిళల పట్ల సమాజం పలు రకాలైన అపోహలు, మూఢనమ్మకాలతో వారిని మానసిక క్షోభకు, నిరాదరణకు గురిచేస్తున్నామని గుర్తు చేశారు. శుభ కార్యాలు, వేషధారణ, ప్రజాదరణ లాంటి అంశాల్లో విధవరాళ్లకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయని, డిజిటల్ యుగంలో కూడా ఇలాంటి వివక్ష కొనసాగుతోందని విచారం వ్యక్తంచేశారు.

దౌత్యవేత్తలుగా మహిళా మేధావులు అనర్హులా?!

(24 జూన్ "అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం" సందర్భంగా)

ఐక్యరాజ్య సమితి తీర్మానం ప్రకారం, ప్రతి ఏటా 24 జూన్ రోజు ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ వూమెన్ ఇన్ డిప్లమసీ)" పాటించడం 2022 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచవ్యాప్తంగా దౌత్యం, అంతర్జాతీయ సంబంధాలు, దౌత్య రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దశగా చర్చలు జరపడం, భవిష్యత్తులో దౌత్య రంగంలో మహిళలను ప్రోత్సహిస్తూ సమాన అవకాశాలు కల్పించడం, విశ్వ శాంతి స్థాపనలో మహిళా మేధావుల నాయకత్వ పాత్రను ప్రశంసిస్తూ వారిని సన్మానించడానికి వేదికగా అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం అవకాశాన్ని ఇస్తున్నది. మహిళలు నిర్ణయాధికార స్థానాల్లో ఉండేలా, వారి గొంతు వినిపించేలా, వారి కృషికి విలువ ఉండేలా చూసే దశకు మనందరం సాధ్యమైనంతగా కృషి చేయాలని పిలుపునిస్తున్నది ఈ వేదిక. అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "అందరి కోసం దౌత్యం (డిప్లమసీ ఫర్ ఆల్)" అనే అంశాన్ని తీసుకొని సమాజ వైవిధ్యాన్ని ప్రతిబింబించే సమానత్వ సాధన, శాంతి సహకారాలకు ప్రాధాన్యం ఇస్తూ సమ్మిళిత దౌత్యం కోసం పిలుపునిస్తూ ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో లింగ సమానత్వం, అసమానతల తగ్గింపు, శాంతి న్యాయ సంస్థలు, లక్ష్యాల సాధనకు భాగస్వామ్యం లాంటి అంశాలను అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం వేదికగా గుర్తు చేసుకోవాలి.

దౌత్య రంగంలో లింగ సమానత్వ సాధన అసాధ్యమా !

ప్రపంచవ్యాప్తంగా దౌత్య రంగంలో మహిళల నాయకత్వ ప్రాతినిధ్యం గణనీయంగా తక్కువగా ఉండడం విచారకరం. క్యాబినెట్ మంత్రులు, విదేశీ వ్యవహారాలు, రక్షణ, భద్రత లాంటి మంత్రిత్వ శాఖల్లో లేదా ఉన్నత రాయబార అధికారుల స్థాయిలో మహిళలు నాలుగింట ఒక వంతు కన్న తక్కువగా 22.9 శాతం మాత్రమే ఉండడం ఓ చేదు నిజం అని తెలుసు కోవాలి. లింగ సమానత్వంలో కొంత పురోగతి సాధించినప్పటికీ, దౌత్య అంతర్జాతీయ స్థాయిల్లో మహిళల ప్రాతినిధ్యం పరిమితంగా ఉండడంతో ఆ రంగాల్లో మహిళామణులను ఆకర్షించడానికి ప్రభుత్వాలు, పౌర సమాజం ముందుకు రావాలి. కేవలం 25 దేశాల్లో మాత్రమే మహిళా దేశాధినేత లేదా ప్రభుత్వాధినేతలు ఉన్నారు. 113 ప్రపంచ దేశాల్లో ఇప్పటి వరకు దేశాధినేతలు లేదా ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో మహిళలకు స్థానం దక్కలేదు. ఐరాస నియమించిన దౌత్య రంగంలో మహిళలు 21 శాతం వరకు మాత్రమే ఉండడం గమనించాలి. రాజకీయ రంగంలో ఆసక్తి చూపుతున్న మహిళలకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ వేధింపులు దినదినం పెరుగుతున్నాయి.

అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం వేదికగా ఐరాస తీసుకునే చర్యలతో పాటు ఈ అంశంలో ప్రజా అవగాహన, కమ్యూనిటీ ఫోరమ్‌లు, శిక్షణ కార్యక్రమాలు, యూనివర్సిటీల్లో మహిళా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. రాజకీయ నియామకాలు, దౌత్య కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధనకు కృషి జరగాలి. దౌత్య రంగంలో రాణిస్తున్న మహిళలను సముచితంగా గౌరవిస్తూ, వారిని ప్రజా క్షేత్రంలో సన్మానించాలి. ప్రపంచ శాంతి, సమ్మిళిత ప్రపంచ పాలన, సమాన భాగస్వామ్య సాధన లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

-మధుపాళీ
9949700037

బంగారు నగల దుకాణంపై బీఐఎస్ దాడులు

న్యూ ఢిల్లీ, జూన్ 22: బంగారు ఆభరణాలపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు హైదరాబాద్‌లోని అబిడ్స్ ప్రాంతంలో ఉన్న ఓ నగల దుకాణంపై భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. బీఐఎస్ చట్టం-2016 మరియు తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి, డైరెక్టర్ పి.వి. శ్రీకాంత్ ఆదేశాల మేరకు, డైరెక్టర్ డ సైంటిస్ట్-ఈ సత్తు సవిత నేతృత్వంలోని బృందం ఈ సోదాల్లో పాల్గొంది.

తనిఖీల సందర్భంగా దుకాణంలో తప్పనిసరి బీఐఎస్ హాల్‌మార్క్ లేకుండా బంగారు ఆభరణాలను విక్రయానికి ఉంచినట్లు అధికారులు గుర్తించారు. అలాగే పాత హాల్‌మార్క్ గుర్తులతో ఉన్న ఆభరణాలు కూడా విక్రయిస్తున్నట్లు తేలింది. ఇవి బీఐఎస్ చట్టం-2016తో పాటు బంగారు ఆభరణాల హాల్‌మార్కింగ్ నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు.

ఈ దాడుల్లో ఉంగరాలు, హారాలు, పెండెంట్లు తదితర ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 1.6 కిలోల బంగారు ఆభరణాలను అధికారులు జప్తు చేశారు. సంబంధిత దుకాణంపై బీఐఎస్ చట్టం-2016 ప్రకారం తదుపరి చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.

వినియోగదారుల రక్షణ బీఐఎస్‌కు అత్యంత ప్రాధాన్యమైన అంశమని.. వినియోగదారులు బీఐఎస్ లోగో, ఆభరణం స్వచ్ఛత కేరట్లలో, హెచ్‌యూఐడీ (సంబర్ ఉన్న హాల్‌మార్క్ బంగారు ఆభరణాలనే కొనుగోలు చేయాలని బీఐఎన్ హైదరాబాద్ శాఖాధి పతి వీవీ శ్రీకాంత్ కోరారు. కొనుగోలు ముందు బీఐఎస్ కేర్ యాప్ ద్వారా ఆభరణాల ప్రామాణికతను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని.. హాల్‌మార్క్ లేని బంగారు ఆభరణాల విక్రయం లేదా బీఐఎస్ హాల్‌మార్క్ దుర్వినియోగం గమనించినట్లయితే, బీఐఎస్ కేర్ యాప్ ద్వారానే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. అలాగే నగల వ్యాపారులు అందరూ తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, బీఐఎస్ చట్టం-2016 ప్రకారం హాల్‌మార్క్ కలిగిన బంగారు ఆభరణాలనే విక్రయించాలని సూచించారు.

వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల అమలు, మార్కెట్‌లో పారదర్శకత పెంపు లక్ష్యంగా బీఐఎస్ రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ నిఘా, అమలు చర్యలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే ముందు హెచ్‌యూఐడీ నంబర్‌ను బీఐఎస్ కేర్ యాప్ ద్వారా తప్పనిసరిగా ధృవీకరిం చుకోవాలని, ప్రతి కొనుగోలుకు సరైన బిల్లు తీసుకోవాలని సూచించారు.

బిజెపి కిసాన్ మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా జక్కుల సత్తన్న

ఆదిలాబాద్, జూన్ 23: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా కడెం మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు జక్కుల సత్తన్న యాదవ్ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచనల మేరకు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవపురం లక్ష్మీనరసయ్య ఈ మేరకు నియామక పత్రాన్ని జారీ చేశారు.

జక్కుల సత్తన్న యాదవ్ 1991 నుంచి బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఆయన ఐదు పర్యాయాలు బీజేపీ కడెం మండల అధ్యక్షుడిగా, గొర్రెకాపర్ల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, బీజేపీ నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పలు బాధ్యతలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తనను కిసాన్ మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవపురం లక్ష్మీనరసయ్యకు జక్కుల సత్తన్న యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నేతలు

ఆదిలాబాద్, జూన్ 23:కడెం మండలంలోని సారంగాపూర్ గ్రామానికి చెందిన సందుల సాకలి రాజేశ్వర్ 14 రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. తండ్రి మృతితో తీవ్ర మనోవేదనకు గురైన ఆయన చిన్న కుమారుడు సందుల సాకలి వినీత్ కుమార్ ఫాదర్స్ డే రోజున చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబంలో విషాదం మరింత పెరిగింది.

ఈ ఘటన గురించి తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, కడెం మండల మాజీ ఎంపీపీ భూక్య అమ్మి బాపూరావు మంగళవారం సారంగాపూర్ గ్రామంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి దుఃఖాన్ని పంచుకున్నారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఈ క్లిష్ట సమయంలో అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సారంగాపూర్ మాజీ సర్పంచ్ మేకల రాజారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కోల నరేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్మూర్ లచ్చన్న, పసుపుల చిన్న నరసయ్య, గజ్జి రాములు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ త్యాగాలు స్ఫూర్తిదాయకం..

సూర్యాపేట, జూన్ 23: దేశ సమగ్రత, జాతీయ ఏకత్వం కోసం శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డి అన్నారు మంగళవారం స్థానిక భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన్ దివాస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు.

భారతదేశ ఐక్యత కోసం ఆయన చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుక్మారావు, కార్మిక సంఘ జిల్లా కన్వీనర్ శేషగిరి, ప్రధాన కార్యదర్శి ఫణి, ఉపాధ్యక్షులు పాండురంగాచారి, బిక్షమయ్య, ఆఫీస్ సెక్రటరీ రవివర్మ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల నాయకులు మన్మథరెడ్డి, వెంకటరెడ్డి, మాల్సూర్ గౌడ్, వెంకన్న, పరశురామ్, రావినాయక్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

31 మిలియన్లకు పైబడిన ఆధార్ యాప్ డౌన్‌లోడ్‌లు...

ఈ యాప్‌ను వినియోగిస్తున్న వారు పెరుగుతున్నారనడానికి ఇదే సూచిక

న్యూ ఢిల్లీ, జూన్ 22:ఆధార్ యాప్‌నకు భారత్ అంతటా ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. దీనిని ప్రారంభించిన 5 నెలల కన్నా తక్కువ సమయంలో 3.1 కోట్ల కన్నా ఎక్కువ మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇది ఈ యాప్ పట్ల ప్రజల్లో భరోసా పెరుగుతుండటాన్ని సూచిస్తోంది. వివిధ సేవలను వారికి చాలా సులభంగా ఈ యాప్ అందిస్తుండడం ఈ ఆదరణకు కారణం అవుతోంది.

జీవన సౌలభ్యాన్ని మెరుగుపరిచే దృష్టితో రూపొందించిన కొత్త ఆధార్ యాప్ ప్రజలకు తమ స్మార్ట్‌ఫోన్ నుంచే మొబైల్ నంబరును అప్‌డేట్ చేసుకోవడం, చిరునామాను అప్‌డేట్ చేసుకోవడం సహా వివిధ సేవలను సులభంగా పొందేందుకు వీలు కల్పిస్తోంది.

ఇంతవరకు, సుమారు 40 లక్షల మంది నూతన ఆధార్ యాప్‌ను ఉపయోగించి తమ మొబైల్ నంబరును అప్‌డేట్ చేసుకున్నారు. అలాగే, 8,50, 000 మంది ఈ యాప్‌ను ఉపయోగించి తమ చిరునామాను అప్‌డేట్ చేసుకున్నారు.

ఆధార్ సంఖ్యను కలిగి ఉన్న వారికి (ఆధార్ నంబర్ హోల్డర్స్.. ఏఎన్‌హెచ్) తమ గుర్తింపును ప్రదర్శించే, పంచుకొనే, ప్రమాణీకరించేందుకు సౌకర్యకర పద్ధతిని, గోపనీయతకు ప్రాధాన్యాన్నిచ్చే పద్ధతిని అందించేలా ఈ యాప్‌ను రూపొందించారు.

అనేక ప్రజాహితకర సౌకర్యాలు ఈ యాప్‌లో జతపరిచారు. వాటిలో.. ఒక్క క్లిక్‌లో బయోమెట్రిక్ లాక్, అన్‌లాక్, ఉనికిని ప్రమాణీకరించడానికి ముఖాన్ని సరిచూడటం, ప్రమాణీకరణ చరిత్ర, విజిటింగ్ కార్డులకు బదులు సమాచారాన్ని పంచుకోవడానికి క్యూఆర్ కోడ్ ఆధారిత, మార్పుచేర్పులకు వీలు ఉండే కాంటాక్ట్ కార్డు వంటివి ఉన్నాయి. ఇది ఈ-ఆధార్ ను డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. ఆధార్ సేవా కేంద్రాల వంటి చోట్లకు వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంటును బుక్ చేసుకోవడాన్ని సరళతరం చేస్తుంది.నిజ జీవితంలో అనేక రకాల ఉపయోగాలకు ఆధార్ యాప్ సహాయప డుతుంది. ఈ ఉపయోగాలలో.. ఆఫ్‌లైన్ వెరిఫికే షన్ సీకింగ్ ఎంటిటీ (ఓవీఎస్ ఈ)కి చెందిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి హోటల్ చెక్-ఇన్‌లను పూర్తి చేసుకోగలగడం వంటివి కలిసి ఉన్నాయి.

వ్యవసాయ ఉత్పాదనల వేలం ప్రక్రియలో పారదర్శకత్వాన్ని, దక్షతని, డిజిటల్ ప్రక్రియల్ని పటిష్ఠపరచనున్న 'నాఫెక్స్‌డాట్‌ఇన్'

న్యూ ఢిల్లీ, జూన్ 22:నాఫెడ్ వేలంపాటల పోర్టల్ 'నాఫెక్స్ డాట్‌ఇన్' ను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా రేపు.. అంటే 2026 జూన్ 23న న్యూఢిల్లీలోని అటల్ అక్షయ్ ఊర్జా భవన్‌లో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ కూడా పాల్గొంటారు. నాఫెడ్ ఛైర్మన్ శ్రీ జేఠాభాయి అహీర్, నాఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దీపక్ అగర్వాల్, సీనియర్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకొంటారు.

ఇదే కార్యక్రమంలో.. నాఫెడ్‌కు చెందిన అనేక ముఖ్య డిజిటల్ కార్యక్రమాలనూ, రైతులకు ప్రయోజనాలు అందించడానికి ఉద్దేశించిన కార్యక్రమాలను శ్రీ అమిత్ షా ప్రారంభిస్తారు. వాటిలో.. రైతుల పిల్లలకు నాఫెడ్-కల్యాణ్ ఉపకార వేతనం, పప్పుధాన్యాలతో పాటు నూనెగింజల ఇన్వెంటరీ మేనేజ్‌మెంటు కోసం 'దృష్టి' పోర్టల్, ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగును బలోపేతం చేయడానికి ఉద్దేశించిన 'ఈ ఆర్‌పీ' పోర్టల్, వేలానికి తోడ్పడే 'నాఫెక్స్‌డాట్‌ఇన్' పోర్టల్ భాగంగా ఉన్నాయి. వేలం పోర్టల్‌లో లైవ్ రిజిస్ట్రేషన్ పద్ధతిని కార్యక్రమంలో ప్రదర్శిస్తారు. దీంతో పాటు, వేలం ప్రక్రియను కూడా మొదలుపెడతారు.

'నాఫెక్స్‌డాట్‌ఇన్'ను ప్రారంభించాలన్న నిర్ణయం వేలం ప్రక్రియలో పారదర్శకత్వాన్ని, దక్షతని, కార్యకలాపాల నిర్వహణలో సౌలభ్యాన్ని బలపరిచే దిశగా ఓ ముఖ్య చర్య కానుంది. ఈ పోర్టల్ వేలానికి సంబంధించిన కార్యకాలపాలను వ్యవస్థీకరించడం, రైతులు, సభ్య సంస్థలు, ఆసక్తిదారుల ప్రయోజనాలను లెక్కలోకి తీసుకొని నాఫెడ్ సమగ్ర పనితీరును మరింత ఎక్కువ ప్రభావవంతంగా తీర్చిదిద్దేందుకు ఒక డిజిటల్ వేదికను అందుబాటులోకి తీసుకువస్తుంది.

ఈ సందర్భంగా నాఫెడ్-కల్యాణ్ ఉపకార వేతన చెక్కులను రైతుల పిల్లలకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అందిస్తారు. ఈ కార్యక్రమం రైతుల సంక్షేమంతో పాటు రైతుల పిల్లలు చదువుకోవడానికి సాయపడాలన్న నాఫెడ్ నిబద్ధతకు అద్దం పడుతుంది.

కార్యక్రమాన్ని ప్రారంభించిన తరువాత, నాఫెడ్ డైరెక్టర్ల బోర్డు సభ్యులతో శ్రీ అమిత్ షా సమావేశమవుతారు. నాఫెడ్ కార్యకలాపాలపైనా, పురోగతిపైనా సమావేశంలో ఒక ప్రజెంటేషన్‌నిస్తారు. దీనిలో కేంద్ర మంత్రి ఇంతవరకు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా తీసుకున్న చర్యలతో పాటు నాఫెడ్ భవిష్య ప్రణాళికపై కూడా చర్చిస్తారు.

రైతులకు సహకారాన్ని అందించడంలో, వ్యవసాయ ఉత్పాదనల మార్కెటింగ్‌లో, కొనుగోళ్లు, సహకారిత ఆధారిత వ్యవసాయ వాణిజ్యంలో నాఫెడ్ ముఖ్య పాత్రను పోషిస్తోంది. డిజిటల్, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించబోవడం.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెబుతున్న ''సహకార్ సే సమృద్ధి'' విజన్‌ను సాకారం చేయడంతో పాటు సాంకేతికత, పారదర్శకత్వం, రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యాన్నిస్తూ సహకార సంస్థలను పటిష్ఠపరచాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు కూడా అనుగుణంగా ఉండబోతోంది.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

-విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
-కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలమ్

కరీంనగర్, జూన్ 23: మాదక ద్రవ్యాల నిర్మూలనే తమ ప్రధాన లక్ష్యమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలమ్ పేర్కొన్నారు. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. సీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. డ్రగ్స్ పై వ్యతిరేకంగా విద్యార్థుల కమ్యూనిటీ విజిలెన్స్ కమిటీల ఏర్పాటు వంటివి చేపడతామన్నారు.

యువత మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత కాదు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ పిలుపునిచ్చారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

5 లక్షలకు చేరుకున్న అవయవ దాతలు... భారత్ రికార్డు

న్యూ ఢిల్లీ, జూన్ 22: అవయవ దాన ఉద్యమంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భారత్ 5 లక్షలకు పైగా అవయవ దాన ప్రతిజ్ఞలను నమోదు చేసింది. ఇది ప్రాణాలను రక్షించే అవయవ, కణజాల దానం పట్ల ప్రజల్లో పెరుగుతున్న అవగాహన, కరుణ, ఉమ్మడి నిబద్ధతకు అద్దం పడుతోంది.

అవయవ మార్పిడి కోసం వేచి చూస్తున్న రోగుల్లో ఆశనూ, వారికి పునర్జన్మను ప్రసాదించే ఒక గొప్ప మానవతా దృక్పథంగానూ అవయవ దానాన్ని గుర్తించడంలో ప్రజలలో పెరుగుతున్న స్పృహను ఇది స్పష్టం చేస్తోంది. స్వచ్ఛంద అవయవ, కణజాల దానాన్ని ప్రోత్సహించడంతో పాటు అవగాహనతో కూడిన భాగస్వామ్యాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించడానికి భారత ప్రభుత్వం చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో ఇది గొప్ప పురోగతిని కూడా సూచిస్తోంది.

నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎన్ఓటీటీఓ) డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవయవ దాన కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రజల నుంచి లభించిన అపారమైన మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలలో అవగాహన కల్పించడంలోనూ, ప్రజల మద్దతును కూడగట్టడంలోనూ కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విద్యా సంస్థలు, మీడియా సంస్థలు, ఇతర భాగస్వాముల విలువైన సహకారాన్ని ఆయన కొనియాడారు. ఈ మైలురాయిని చేరుకోవడంలో రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల, పరిపాలనా యంత్రాంగాలు అందిస్తున్న నిరంతర నిబద్ధతనూ, సహకారాన్నీ, వారి ప్రయత్నాలనూ కూడా ఆయన అభినందించారు.

స్వచ్ఛంద అవగాహన పెంపొందించడం, సంస్థాగత సామర్థ్యాలను మెరుగుపరచడం అవయవ మార్పిడి వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా అవయవాలు, కణజాల డిమాండ్ - లభ్యత మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడానికి భారత ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది. దేశవ్యాప్తంగా అవయవ మార్పిడి ప్రక్రియలు నైతికంగా, సమానత్వంతో, పారదర్శకంగా, రోగి ప్రాధాన్యత ఆధారంగా సాగేలా చూడటంపైనే నిరంతరం దృష్టి సారిస్తూ ఈ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

రైతులు సన్న రకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి..

–రాష్ట్ర ప్రభుత్వ విప్ విప్ విజయరమణారావు

కరీంనగర్, జూన్ 23: ఆరుగాలం శ్రమిస్తున్న రైతన్నలు సన్న రకానికి అధిక ప్రాధాన్య తనిచ్చి ప్రభుత్వం అందించే బోనస్ ను పొందాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి రైతు వేదికలో విత్తన మేళాను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిరంతరం రైతుల శ్రేయస్ కోసం శ్రమిస్తున్నారని సన్న రకాలను పండించి బోనస్ పొందాలని సూచించారు. గతంలో ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిత్యం రైతు శ్రేయస్ కోసమే పని చేస్తుందన్నారు. విత్తన మేళాలో, రైతుల శ్రేయస్సు కోసం పలు ముఖ్య మైన విషయాలు వివరించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వరి సన్న రకాలు 23 నుండి 30 వరకు ప్రతీ రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

రైతులకు అందించాల్సిన యూరియా సమృద్ధిగా ఉందని రైతులెవరు అధైర్యపడవద్దని వివరించారు. శాస్త్ర వేత్తలు, వాతావరణ నిపుణులు హెచ్చరి కల నేపథ్యంలో తెలంగాణ జిల్లాల్లో ఎల్నీనో ప్రభావం అధికంగా ఉంటుందని, తగినంత వర్షపాతం పడిన తర్వాతనే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న రకాలను సాగు చేస్తేనే క్వింటాల్కు 500 బోనస్ లభిస్తుందని, జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతు తప్పనిసరిగా సాగులో నానో ఎరువులు విరివిగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, ఇతర గ్రామ సర్పంచ్ లు, జిల్లా వ్యవసాయ అధికరి శ్రీనివాస్, ఏవో పైడితల్లి, మండల ఏఈవోలు రాజు, పద్మ, అనుష, రవితేజ, ఆనంద్ రావు, విత్తన లెసైన్సు కలిగిన డీలర్స్, రైతులు పాల్గొన్నారు.

గుత్తికోయ యువకులకు వాలీబాల్ కిట్ల పంపిణీ..

–పోలీసుల అవగాహన కార్యక్రమం

ఖమ్మం, జూన్ 23: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పెద్దవెంకటాపురం పంచాయతీ భూసరాయి గుత్తికోయ గిరిజన గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేసినట్లు ఎస్ఐ ముతినేని సోమేశ్వర్ తెలిపారు.

ఈ సందర్భంగా భూసరాయి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పరిశుభ్రత, రోడ్డు భద్రత, మూఢనమ్మకాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. అవసరమైతే కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం పొందాలని పేర్కొన్నారు.

చేతబడులు, మూఢనమ్మకాల పేరుతో ఒకరిపై ఒకరు దాడులు చేయడం, హత్యలకు పాల్పడడం వంటి ఘటనలు సమాజానికి హానికరమని తెలిపారు. అనుమానాలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మొబైల్ సందేశాలు, వాట్సాప్, ఫోన్‌పే, గూగుల్ పే, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు.

గ్రామ యువకుల అభ్యర్థన మేరకు వాలీబాల్ కిట్లు అందజేసి క్రీడలను ప్రోత్సహించినట్లు తెలిపారు. తెలంగాణ పోలీసు శాఖ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ట్రాఫిక్ నియంత్రణ, పెట్రోలింగ్, రహదారి భద్రత, వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి సేవలను అందిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మిక కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం

న్యూఢిల్లీ, జూన్ 23: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మిక కేసులను త్వరితగతిన పరిష్కరించడం కోసం భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ప్రధాన కార్మిక కమిషనర్ (కేంద్ర) కార్యాలయం ఒక ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం 2026 జూన్ 01 నుంచి 2026 ఆగస్టు 31 వరకు న్యూఢిల్లీలో కొనసాగనుంది.

ఈ ప్రత్యేక కార్యక్రమ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు.. ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు సంబంధించిన 178 క్లెయిమ్ కేసులను ప్రత్యేక విచారణ, పరిష్కారం కోసం గుర్తించారు. వేతలనాల కోడ్ 2019 కింద అధికారిగా కూడా వ్యవహరిస్తున్న న్యూఢిల్లీ ప్రాంతీయ కార్మిక కమిషన్ (కేంద్ర).. 24.06.2026న ఉభయ పక్షాలు విచారణకు హాజరుకావాలని 15.06.2026 నాడు నోటీసులు జారీ చేశారు.

పెండింగ్ కేసులను తగ్గించడం, వేగంగా న్యాయం అందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్యలో భాగంగా.. ఈ 178 కేసులన్నింటినీ ఒకే రోజున విచారణ కోసం జాబితా చేశారు. 2026 జూన్ 24వ తేదీ రోజంతా కేవలం డీఎంఆర్‌సీకి సంబంధించిన వ్యవహారాల కోసమే ప్రత్యేకంగా కేటాయించారు. కార్మికుల క్లెయిమ్‌లను సకాలంలో పరిష్కరించేందుకు కార్మిక యంత్రాంగానికి ఉన్న నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది.

ఈ ప్రత్యేక కార్యక్రమం వల్ల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం గణనీయంగా వేగవంతం అవుతుందని, కార్మికులకు సకాలంలో ఉపశమనం లభిస్తుందని, కార్మిక న్యాయ వితరణ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా కేసుల బ్యాక్‌లాగ్‌ను పరిష్కరించడానికి వినూత్నమైన, ఫలితాల ఆధారిత చర్యలను అవలంబించాలనే నీఎల్‌నీ (నీ) సంస్థ దృఢ సంకల్పాన్ని ప్రదర్శిస్తుంది.

ఒకే విధమైన కేసులను వర్గీకరించడం, క్లస్టర్ ఆధారిత విచారణలు చేపట్టడం అనే సరికొత్త విధానానికి ఈ ప్రక్రియ నాంది పలికింది. దీనివల్ల పెద్ద సంఖ్యలో ఉన్న కేసులను సమర్థవంతంగా, నిర్మాణాత్మకంగా, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడానికి కార్మిక అధికారులకు వీలవుతుంది.

ఈ చొరవ దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసుల నువేగంగా పరిష్కరించడానికి ఒక నమూనాగా నిలుస్తుందని, కార్మిక చట్టాల అమలులో పరిపాలనా సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని ఆశిస్తున్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడం ప్రాధాన్యతను... అలాగే కార్మికులు, యజమానులు, ఇతర వాటాదారు టలపై ఈ కార్యక్రమం చూపే ప్రభావాన్ని గుర్తిస్తూ... రాబోయే ప్రత్యేక డ్రైవ్ విజయవంతం కావడానికి తమపూర్తి సహకారం అందిస్తామని డీఎంఆర్‌సీ అడిషనల్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్టులు) హామీ ఇచ్చారు.

కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఎల్లప్పుడూ తక్షణమే స్పందిస్తూ, సులభంగా అందుబాటులో ఉండే కార్మిక పరిపాలన ద్వారా ఫిర్యాదుల సమర్థవంతమైన పరిష్కారానికి, పారిశ్రామిక సంబంధాలను బలోపేతం చేయడానికి, కార్మికుల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు..

నిజామాబాద్, జూన్ 23:బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు మళ్లీ ఊపందుకున్నాయి. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో ముచ్కూర్ సొసైటీ మాజీ చైర్మన్ వెంకటేష్, బాడా భీమ్‌గల్ గ్రామపంచాయతీ 12వ వార్డు సభ్యుడు మాంద్ర సుమన్‌తో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు నెల్ల రంజిత్, మూర్తి, మహేష్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సునీల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని, ఆ విశ్వాసంతోనే వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు.



న్యూఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కొత్త ప్రధాన కార్యాలయ భవనానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన

న్యూ ఢిల్లీ, జూన్ 22:న్యూ ఢిల్లీలోని లోధి రోడ్‌లోగల 'సీజీఓ' ప్రాంగణంలో కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) ప్రధాన కార్యాలయ కొత్త భవన నిర్మాణానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ నేడు శంకుస్థాపన చేశారు. అలాగే, 'సీఐఎస్ఎఫ్' కోసం నిర్మించిన సుమారు 136.03 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించి, మరికొన్నిటిని దేశానికి అంకితం చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి శ్రీ గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ శ్రీ తపన్ కుమార్ దేకా, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రవీర్ రంజన్, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) సీనియర్ అధికారులు, సీపీడబ్ల్యూడీ, ఎస్‌బీఐ, అధికారులు సహా సీఐఎస్ఎఫ్ మాజీ డైరెక్టర్ జనరళ్లు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ కొత్త ప్రధాన కార్యాలయ భవనాన్ని సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) సుమారు 75.78 కోట్ల వ్యయంతో నిర్మిస్తుంది. ఇది సీఐఎస్ఎఫ్ పరిపాలన కార్యకలాపాలు, వ్యూహాత్మక విధుల ప్రధాన కూడలిగా పనిచేస్తుంది. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించే ఈ 9 అంతస్తుల భవనంలో డైరెక్టర్ జనరల్ కార్యాలయం, బలగంలోని వివిధ విభాగాల కార్యాలయాలు, కంట్రోల్ రూమ్, సమావేశ గదులు, ఆడిటోరియం, గ్రంథాలయం, జిమ్నాసియం సహా ఇతర సదుపాయాలు ఉంటాయి.

ఈ భవనానికి శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పూర్తయిన 3 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను శ్రీ బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. వీటిలో... హైదరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ)లో 34.22 కోట్లతో నిర్మించిన సబార్డినేట్ ఆఫీసర్స్ మెస్ (ఆదిత్య), హైదరాబాద్‌లోని 'ఎన్ఐఎస్ఏ'లో ?20.53 కోట్లతో నిర్మించిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ బిల్డింగ్ (అభ్యాస్), తమిళనాడులోని శివగంగై, అమరావతి పురంలో గల 4వ రిజర్వ్ బెటాలియన్‌లో 5.50 కోట్లతో నిర్మించిన సబార్డినేట్ ఆఫీసర్ల క్వార్టర్స్ ఉన్నాయి.

దీంతోపాటు వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద విధి నిర్వహణలో మరణించిన 'సీఐఎస్ఎఫ్' సిబ్బంది కుటుంబాలకు రూ.1 కోటి ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. దీంతోపాటు స్వచ్ఛంద సంస్థ 'సంరక్షిత', స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్త సహకారంతో ప్రత్యేకంగా రూపొందించిన మోటారు వీల్‌చైర్‌లను దళ సిబ్బంది దివ్యాంగ పిల్లలకు బహూకరించారు.

ఈ సందర్భంగా శ్రీ బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ– 'సీఏపీఎఫ్' సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన, హోం–సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో బలగాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రకటించారు. వాటిలో 'ఆయుష్మాన్ సీఏపీఎఫ్', 'సీఏపీఎఫ్ ఐఎంఎన్' వంటి పథకాల ద్వారా నగదు రహిత ఆరోగ్య సంరక్షణ సౌకర్యం, 'సీఏపీఎఫ్' ఇ–ఆవాస్ పోర్టల్ ద్వారా పారదర్శక గృహ కేటాయింపు, విధి నిర్వహణలో వైకల్యానికి గురైన సిబ్బంది గౌరవప్రదంగా, వృత్తిగత పురోగతితో, పూర్తి సేవా ప్రయోజనాలతో సేవలు కొనసాగించేలా కారుణ్య వైకల్య విధానం వంటివి ఉన్నాయని ఆయన వివరించారు. మానసిక ఆరోగ్య సహాయం కోసం ప్రాజెక్ట్ 'మాన్' వంటి కార్యక్రమాలను, కేంద్రీయ పోలీస్ కల్యాణ్ భండార్ నెట్‌వర్క్ ద్వారా ఆర్థిక ఉపశమన చర్యలను చేపట్టడాన్ని శ్రీ సంజయ్ కుమార్ ప్రశంసించారు.

అనంతరం 'సీఐఎస్ఎఫ్' డైరెక్టర్ జనరల్ శ్రీ ప్రవీర్ రంజన్ ప్రసంగిస్తూ– భద్రత సవాళ్ల స్వరూపం నానాటికీ మారిపోతున్నదని గుర్తుచేశారు. కొత్తగా తలెత్తే ముప్పులను పసిగట్టి, నివారించడంలో దళం సంసిద్ధతను ఆయన వివరించారు. ఆధునిక భద్రత ముప్పులలో సైబర్ దాడులు, డిజిటల్ విధ్వంసం, డ్రోన్లు, ఇతర సాంకేతికత ఆధారిత ప్రమాదాలు వంటి హైబ్రిడ్ ప్రమాదాలు అధికంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ ఇటీవల 'సీఐఎస్ఎఫ్'కు అనేక కొత్త బాధ్యతలు అప్పగించిందని ఆయన తెలిపారు.అంతర్జాతీయ నౌకా–ఓడరేవు సౌకర్యాల భద్రత (ఐఎస్‌పీఎస్) కోడ్ కింద సీఐఎస్ఎఫ్ గుర్తింపు పొందిన భద్రత సంస్థ (ఆర్ఎస్ఓ)గా నియమితమైందని చెప్పారు. ప్రధాన ఓడరేవుల భద్రత తనిఖీ–అంచనాలను చేపట్టడానికి, దేశంలో వర్ధమాన నీలి ఆర్థిక వ్యవస్థ భద్రతకు ఇది దోహదం చేస్తుందని డైరెక్టర్ జనరల్ అన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని అత్యంత భద్రతగల జైళ్లు, కారాగారాల భద్రత బాధ్యతలను తమ దళం స్వీకరించిందని తెలిపారు. అంతర్గత భద్రత నిర్వహణలో తమ దళం పాత్ర మరింత విస్తరిస్తున్నదని పేర్కొన్నారు.

సాంకేతికత ఆధారిత భద్రత పరిష్కారాలకు ప్రాధాన్యంతో డ్రోన్, యాంటీ–డ్రోన్ టెక్నాలజీ దిశగా 'ఆర్టీనీ బెట్రోర్'ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా రూపొందిస్తున్నట్లు శ్రీ ప్రవీర్ రంజన్ తెలిపారు. శత్రు డ్రోన్ ముప్పు నుంచి కీలక మౌలిక సదుపాయాల రక్షణ కోసం 'సీఐఎస్ఎఫ్'ను నోడల్ ఏజెన్సీగా నియమించారు. దీంతోపాటు ఐఐటీ–మద్రాస్ ప్రవర్తక్, గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, సి–డాక్ వంటి ప్రసిద్ధ సంస్థల సహకారంతో ప్రత్యేక సైబర్ భద్రత బృందాలకు శిక్షణ ఇప్పిస్తున్నారు.

తమ బలగాల్లో మహిళా సాధికారత వైపు కీలక చర్యగా హర్యానాలోని 'సుహ్' వద్ద 1,024 మంది సిబ్బందితో తొలి మహిళా సీఐఎస్ఎఫ్ రిజర్వ్ బెటాలియన్‌ను ఏర్పాటు చేయడానికి మంత్రిత్వశాఖ ఆమోదించినట్లు డైరెక్టర్ జనరల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

దేశం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి చేరువవుతున్న తరుణంలో ఈ కార్యక్రమం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ సేవ, భద్రత, పురోగమనంపై బలగాల నిరంతర నిబద్ధతకు ఇది ప్రతీకగా నిలుస్తుంది.

పేరేపల్లి వద్ద కెమికల్ లీక్ కలకలం

–ఫార్మా కంపెనీల నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తుల ఆరోపణ

నల్గొండ, జూన్ 23:చిట్యాల మండలం పేరేపల్లి గ్రామ పరిధిలోని వియాస్ ఫార్మా కంపెనీ నుంచి మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు రసాయన వాయువు లీక్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కెమికల్ దుర్వాసన వ్యాపించడంతో పేరేపల్లి, వెలిమినేడు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో సంచరిస్తున్న రైతులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు అస్వస్థతకు గురయ్యారు.

ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులు, పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు బయలుదేరిన వారు, పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు రసాయన వాయువు ప్రభావంతో కళ్ల మంటలు, తలనొప్పి, తల తిరగడం, వాంతులు వంటి సమస్యలను ఎదుర్కొన్నారు. అస్వస్థతకు గురైన వారిని వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

ఫార్మా కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం, రసాయనాల నిర్వహణలో యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భద్రతా ప్రమాణాలను సక్రమంగా పాటించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

రసాయన పరిశ్రమల నిర్లక్ష్యంతో గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని, ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు స్పందించి నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పరిశ్రమలపై కఠిన పర్యవేక్షణ చేపట్టి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తూ, కెమికల్ లీక్‌కు గల కారణాలపై విచారణ చేపట్టినట్లు సమాచారం.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

–మంత్రి వివేక్ వెంకటస్వామి

ఆదిలాబాద్, జూన్ 23:మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

చెన్నూర్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి చెన్నూర్ పట్టణ పోలీసులు, పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా "నషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్లను విడుదల చేసి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.

యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మంత్రి సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. చెన్నూర్‌ను మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో చెన్నూర్ సీఐ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ శాఖ ఏడీఈ, పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

2027 హజ్ విధానం విడుదల: యాత్రికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించిన ఇండియన్ హజ్ కమిటీ

న్యూ ఢిల్లీ, జూన్ 22:కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నేడు 2027 సంవత్సరానికి సంబంధించిన హజ్ విధానాన్ని ప్రకటించింది. కేంద్ర మైనారిటీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ కిరణ్ రిజిజు ఈ నూతన విధానాన్ని విడుదల చేశారు. దీంతో పాటు హజ్ యాత్ర-2027కు వెళ్లాలనుకునే యాత్రికుల నుంచి దరఖాస్తులను కూడా ఆహ్వానిస్తున్నట్లు ఇండియన్ హజ్ కమిటీ ప్రకటించింది. ఈ దరఖాస్తు ప్రక్రియ నేటి నుంచే ప్రారంభం కానుంది.

హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియను ప్రభుత్వం మరింత సరళతరం, సులభతరం చేసింది. యాత్రికులు హజ్ కమిటీ అధికారిక వేదిక ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. హజ్ సువిధ యాప్ ద్వారా కూడా ఎక్కడి నుంచైనా సులభంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పించారు. ఈ ఏడాది కూడా హజ్ కమిటీ.. ప్రైవేటు రంగాల మధ్య సీట్ల పంపిణీ కోటా యథాతథంగా 70:30 నిష్పత్తిలోనే కొనసాగే అవకాశం ఉంది. ఈ నిష్పత్తి ప్రకారం

హజ్ కమిటీ కోటా: 1,22,518 సీట్లు కాగా ప్రైవేటు రంగం కోటా: 52,507 సీట్లు. గతేడాది భారతీయ యాత్రికుల మొత్తం కోటా 1,75,025 గా ఉంది. ఈసారి భారతీయ యాత్రికుల కోసం హజ్ కోటాను మరింత పెంచేందుకు భారత ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని కేంద్రమంత్రి తెలిపారు.

18 జూన్ 2026న కేంద్రమంత్రి అధ్యక్షతన జరిగిన హజ్ సమీక్షా సమావేశంలో హజ్-2026 నిర్వహణను సమీక్షించారు. ఆ సమావేశంలోనే హజ్-2027కు సంబంధించిన కార్యాచరణను ఖరారు చేశారు. సౌదీ అరేబియా ప్రభుత్వం నిర్దేశించిన సమయపాలనను పాటించడానికి, యాత్రికులకు ముందస్తుగా మెరుగైన ఏర్పాట్లు చేయడానికి వీలుగా ఈసారి విధానాన్ని చాలా ముందుగానే ప్రకటించి, దరఖాస్తులను కూడా వెంటనే స్వీకరిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

హజ్ యాత్రను ప్రతి ఒక్కరికీ మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా, గౌరవప్రదంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. హజ్-2026లో ప్రవేశపెట్టిన పలు యాత్రికుల-సానుకూల సంస్కరణలను ఈ నూతన విధానంలోనూ కొనసాగిస్తున్నారు. ఇందులో మినాలో మంచాలుగా మార్చుకునే వీలున్న సోఫాల వసతి, మక్కా, మదీనా నగరాల మధ్య హై స్పీడ్ రైలు ప్రయాణం, మక్కాలో హోటల్ తరహా వసతి సౌకర్యాలు, 20 రోజుల స్వల్పకాలిక హజ్ ప్యాకేజీ వంటివి ఉన్నాయి. ఈ అద్భుతమైన ఏర్పాట్లు, సమర్థవంతమైన నిర్వహణకు గాను సౌదీ అరేబియా హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ అందించే ప్రతిష్టాత్మక ఉత్తమ హజ్ సమన్వయం, కమ్యూనికేషన్ విభాగంలో రెండు లబ్బైతుమ్ అవార్డులను భారత హజ్ మిషన్ దక్కించుకుంది. భారత్‌కు ఈ అత్యున్నత అంతర్జాతీయ పురస్కారాలు దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈ నూతన విధానంలో చేసిన కీలక మార్పుల్లో భాగంగా క్షేత్రస్థాయిలో యాత్రికులకు సహాయాన్ని మరింత మెరుగుపరచడానికి గతంలో ప్రతి 150 మందికి ఒకరుగా ఉన్న స్టేట్ హజ్ ఇన్‌స్పెక్టర్ (అధికారిక పర్యవేక్షకుడు) నిష్పత్తిని ఈసారి ప్రతి 135 మందికి ఒకరుగా మార్చారు. అలాగే పెరుగుతున్న వెయిటింగ్ లిస్టు సమస్యను పారదర్శకంగా పరిష్కరించేందుకు హజ్-2026 తుది వెయిటింగ్ లిస్టులోని తొలి 20 శాతం మంది దరఖాస్తుదారులకు ఈ ఏడాది ప్రాధాన్యత ఇవ్వనున్నారు. గతేడాది మంచి స్పందన లభించిన స్వల్పకాలిక హజ్ ప్యాకేజీని ఈసారి కూడా కొనసాగిస్తూ.. తూర్పు ప్రాంత ప్రయాణికుల నుంచి వస్తున్న భారీ డిమాండ్ దృష్ట్యా కోల్‌కతాను అదనపు ప్రయాణ కేంద్రంగా చేర్చారు.

యాత్రికుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని వైద్య పరీక్షల నిబంధనలను సౌదీ అరేబియా మార్గదర్శకాలకు అనుగుణంగా మార్చారు. ఇందులో భాగంగా తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి యాత్రకు వెళ్లేందుకు అనుమతించకూడదని నిర్ణయించి తనిఖీలను మరింత కఠినతరం చేశారు.

హజ్ యాత్రికుల సమగ్ర నిర్వహణను మరింత బలోపేతం చేయడం కోసం కేంద్ర మంత్రిత్వ శాఖ సరికొత్తగా కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగిస్తోంది. ఇందులో భాగంగా యాత్రికుల దరఖాస్తులు, డాక్యుమెంట్ల పరిశీలనను ఏఐ సహాయంతో వేగవంతం చేయడం, వివిధ ప్రయాణ కేంద్రాల నుంచి విమానాల కేటాయింపు ప్రక్రియను డిమాండుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయడం, యాత్రికుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన పరిష్కారాలు చూపేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. సాంకేతికతతో కూడిన హజ్ యాత్రను అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ఈ సరికొత్త ఏఐ సేవలను విడతలవారీగా అమలు చేయనున్నారు.

ఈ సాంకేతిక ప్రయత్నాల్లో అత్యంత కీలకమైనది హజ్ యాత్రికుల కోసం ప్రత్యేకంగా రూపొందిస్తున్న సంభాషణాత్మక కృత్రిమ మేధ సహాయక వ్యవస్థ. ఇది హిందీ, ఉర్దూతో పాటు ప్రధాన ప్రాంతీయ భాషల్లో 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. యాత్రికులు తమ సొంత భాషలోనే సాధారణ వాయిస్ లేదా మెసెజ్ ద్వారా ప్రశ్నలు అడిగి మార్గదర్శకత్వం పొందవచ్చు. దరఖాస్తును నింపడం, సమర్పించడం దగ్గరి నుంచి చెల్లింపులు, విమానాలు, వసతి, లగేజీ వివరాలు పొందడం, ఫిర్యాదులు నమోదు చేయడం, అత్యవసర సహాయం పొందడం వంటి ప్రతి దశలోనూ ఇది యాత్రికులకు తోడ్పడుతుంది. దీనివల్ల దరఖాస్తులలో తప్పులు, తిరస్కరణలు తగ్గుతాయి. మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది. మొదటిసారి వెళ్లేవారికి, వృద్ధులకు ఖచ్చితమైన సమాచారం సులభంగా అందుతుంది. దీనిని సౌదీ అరేబియాకు చెందిన నుసుక్ వేదికతో కూడా అనుసంధానించనున్నారు. తద్వారా భారత్, సౌదీ దేశాల హజ్ సేవా వ్యవస్థలు ఒకదానితో ఒకటి కలిసి పనిచేస్తూ యాత్రికులకు ప్రయాణమంతటా ఒకే రకమైన, ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తాయి.

అర్హులైన యాత్రికులందరూ నిర్దేశించిన గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కేంద్రమంత్రి కోరారు. దరఖాస్తుల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, సంబంధిత సంస్థలన్నింటినీ ఆయన ఆదేశించారు. ప్రతి భారతీయ యాత్రికుడికి సురక్షితమైన, సౌకర్యవంతమైన, పారదర్శకమైన, గౌరవప్రదమైన హజ్‌ను అందించడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

బస్వాపూర్ పాఠశాలలో అక్షరాభ్యాసం..

-బడిబాట ద్వారా విద్యార్థుల చేరికలు

నిజామాబాద్, జూన్ 23: జుక్కల్ మండలంలోని బస్వాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

అనంతరం పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి, సరస్వతీ దేవి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జయచంద్, గ్రామ పెద్ద సురేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందజేస్తున్నామని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యా ప్రమాణాలు పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోర్కార్ అనిల్, గ్రామ కార్యదర్శి భరద్వాజ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్పంచ్ జీతం కార్మికులకు అందజేత

-ముచ్కూర్ గ్రామపంచాయతీ కార్మికులకు సర్పంచ్ జీతాన్ని పంపిణీ..

నిజామాబాద్, జూన్ 23: భీమ్‌గల్ మండలంలోని ముచ్కూర్ గ్రామ పంచాయతీ లో పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ కోడిగాల శ్రీనివాస్ ఐదు నెలల వారి యొక్క జీతాన్ని గ్రామపంచాయతీ కార్మికులకు అందజేశారు. సర్పంచ్ జీతం నెలకు 6500/- చొప్పున ఐదు నెలల జీతం మొత్తం రూ.32,500 రావడంతో మంగళవారం ఎనిమిది మంది గ్రామపంచాయతీ కార్మికులకు పంపిణీ చేయగా, కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పడగల శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి పాలకవర్గం, గ్రామ ప్రజల సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను సుమారు 95 శాతం వరకు పరిష్కరించామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా స్మశానవాటిక మరమ్మతులు, నూతన బస్టాండ్ నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం, ఐమాక్స్ లైట్ల ఏర్పాటు, సుమారు 800 మీటర్ల పైప్‌లైన్ విస్తరణ, కొత్త బోర్లు మరియు మోటార్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విజయాలకు ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్, ఎంపీవో సయ్యద్ జావీద్ అలీ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పీఆర్ ఏఈ, ఏపీవో సర్సయ్య తదితర అధికారుల సహకారం ఎంతో ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాశెట్టి రమేష్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్మికులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

అధికారం పోయిన అక్కసే.. హరీష్ రావుకు సీతక్క కౌంటర్

మహబూబ్‌నగర్, జూన్ 23: బీఆర్ఎస్ రాష్ట్ర నేత హరీష్ రావు అబద్ధాలకు నిలువుటద్దమని, అధికారం కోల్పోయిన అక్కసుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయ్యాడని ఓర్వలేక విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి సీతక్క అన్నారు.

సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అచ్చంపేటలో ఒక సమావేశంలో పాల్గొన్న హరీష్ రావు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ ముమ్మాటికి నాగర్ కర్నూల్ జిల్లా వాసీ అని, నల్లమల్ల బిడ్డని, శౌర్యం పౌరుషం ఉన్న వ్యక్తి అని అన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రుణాలు తెచ్చి భారాలు మోపి వడ్డీలపై వడ్డీలు చేసిన నిజాన్ని ప్రజలకు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మీ మరదలు కవిత మీపై ఆరోపణలు చేస్తోందని వాటికి సమాధానాలు చెప్పాలన్నారు. ప్రజలకు మేలు చేసే కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు.

అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 14 సీట్లు గెలుస్తామని ఒక్క సీటు ఓడిపోయినా.. గెలిచిన అందరం రాజీనామాలు చేస్తామని సవాల్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, రాష్ట్ర మహిళ కాంగ్రెస్ నాయకురాలు సంధ్యారెడ్డి మార్కెట్ చైర్మన్ రమణ రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల వెంట వాహన మరమ్మతు, పంక్చర్ సేవల ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ ఆదేశం

న్యూఢిల్లీ, జూన్ 23:జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల వెంట ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, సదుపాయాల లభ్యతను పెంచడానికి భారత జాతీయ రహదారుల సంస్థ యాజమాన్యంలోని నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎల్ఎంఎల్) కీలక నిర్ణయం తీసుకుంది. రహదారి పక్కన ఉండే సదుపాయాల కేంద్రాల (వే సైడ్ అమెనిటీస్) లీజుదారులు సాధ్యమైనంత త్వరగా వాహనాల మరమ్మతు, పంక్చర్ సేవల కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలని తన క్షేత్ర స్థాయి కార్యాలయాలను ఆదేశించింది. జాతీయ రహదారులపై ప్రయాణ అనుభూతిని మెరుగుపరచడం, వాహనాలు నిలిచిపోయే సమయాన్ని తగ్గించడం, రహదారి భద్రతను పెంచడం, ప్రయాణికులతో పాటు సరుకు రవాణాదారులకు తక్షణ సహాయం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

పలు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై పెద్ద సంఖ్యలో వాహన మరమ్మతు, పంక్చర్ సేవల అవసరం ఉందని గుర్తించారు. ఈ సదుపాయాల వల్ల వాహనాలు మొరాయించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో రహదారి వినియోగదారులకు సకాలంలో సాంకేతిక సహాయం లభిస్తుంది. దీనివల్ల ప్రయాణికులకు అనవసర ఇబ్బందులు, ప్రయాణంలో ఆలస్య, భద్రతా పరమైన ప్రమాదాలను నివారించవచ్చు.

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) నమూనా కింద దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన ఆధునిక సదుపాయాల కేంద్రాల వ్యవస్థను ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ అభివృద్ధి చేస్తోంది. రాయితీదారులు, లీజుదారులతో కుదుర్చుకున్న ప్రస్తుత లీజు ఒప్పందాల ప్రకారం.. ప్రతి సదుపాయాల కేంద్రానికి నిర్దేశించిన తప్పనిసరి సౌకర్యాలతోపాటు, అదనంగా అనుమతించదగిన మరికొన్ని సదుపాయాలను కూడా అభివృద్ధి చేయవచ్చు. అధికారిక ఒప్పంద నిబంధనల ప్రకారం అనుమతించిన సదుపాయాల్లోనే వాహనాల మరమ్మతు దుకాణాలు, పంక్చర్ సేవా కేంద్రాలు కూడా ఉన్నాయి.

జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణించే వారికి, వాణిజ్య వాహనదారులకు అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట అందించే సమీకృత సేవా కేంద్రాలుగా ఈ వేసైడ్ అమెనిటీస్ పని చేస్తాయి. ఇలాంటి సౌకర్యాలను అభివృద్ధి చేయడం వల్ల దేశంలో ప్రపంచ స్థాయి జాతీయ రహదారుల మౌలిక సదుపాయాలను సృష్టించాలనే విస్తృత లక్ష్యానికి, రహదారి వినియోగదారులకు అంతరాయం లేని రవాణా సేవలను అందించాలనే సంకల్పానికి మరింత బలం చేకూరుతుంది.

దేశవ్యాప్తంగా ప్రయాణికులు, రవాణా వ్యవస్థ ఆపరేటర్ల మారుతున్న అవసరాలను తీరుస్తూనే, దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడేలా సురక్షితమైన, వినియోగదారులకు అనుకూలమైన జాతీయ రహదారి కారిడార్లను అభివృద్ధి చేయడానికి ఎన్‌హెచ్ఏఐ కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది.

పిచ్చికుక్క దాడి.. 15 మందికి గాయాలు..

మహబూబ్‌నగర్, జూన్ 23: జోగులాంబ గద్వాల్ జిల్లా: గద్వాల్ పట్టణం, జమ్మి చెడులోని 4వ వార్డ్ లో మంగళవారం రోజు ఉదయం 7.00 గంటల సమయంలో పిచ్చికుక్క 15 మంది పై దాడి చేసి కరిచింది. గాయపడిన వారు మహబూబ్ నగర్, గద్వాల ప్రభుత్వ ఆసుపత్రు లకు చికిత్స కోసం వెళ్లినట్లు బంధువులు కాలనీవాసులు తెలిపారు. పిచ్చి కుక్కను చంపేం దుకు గాలిస్తున్నారు కాలనీ వాసులు. గద్వాల్ జిల్లా కేంద్రంలో 15 రోజుల క్రిందట నల్లకుంట, కృష్ణ వేణి చౌక్, గంజిపేటలో 20 మందిని పిచ్చికుక్క కరిచిన సంఘటన మరువకముందే మరో సారి ఈ రోజు ఉదయం జమ్మిచౌడులో 15 మంది పై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచిన విషయం లో మున్సిపల్ అధికారులు, జిల్లా యంత్రాంగం చర్యలు చేపటాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కంకర రోడ్డుపై అదుపుతప్పిన ఎక్సెల్ వాహనం.. వృద్ధుడికి గాయాలు

బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

రంగారెడ్డి, జూన్ 23:యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో కంకర రోడ్డుపై ఎక్సెల్ వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. జామచెట్ల బావి నుంచి రామారం వైపు వెళ్తున్న సమయంలో కొండాపురం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ప్రమాదంలో వృద్ధుడికి మోకాళ్లు, తలకు గాయాలు కాగా, ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానిక ఆర్ఎంపీ బీసు మల్లేశ్ వెంటనే ప్రథమ చికిత్స అందించారు.

స్థానికుల కథనం ప్రకారం, ఐదు నెలల క్రితం జామచెట్ల బావి నుంచి కొండాపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. అయితే కేవలం కంకర పరచి పనులను మధ్యలోనే నిలిపివేయడంతో గత నాలుగు నెలలుగా రోడ్డు పూర్తికాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడం, కంకర రోడ్డు కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యారని చెబుతున్నారు.

ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మందుల సామేల్, స్థానిక కౌన్సిలర్ బీసు శ్రీకాంత్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని బీటీ రోడ్డు నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

డ్రగ్స్ మత్తు.. భవిష్యత్తుకు చీకట్లు!

మహబూబ్‌నగర్, జూన్ 23:అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం భవిష్యత్తుకు విఘాతం డిఎస్పీ కృష్ణకుమార్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తొర్రూర్ ఎస్డీపీఓ కృష్ణ కుమార్, సీఐ గణేష్ సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం తమ జీవితాలపై దుష్ప్రభావాలు చూపడతాయని అవి మీ భవిష్యత్తును నాశనం చేస్తాయని అంతే కాకుండా చట్టపరమైన పరిణామాలు ఉంటాయని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

భారత ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ కు ఘన స్వాగతం

అమరావతి, జూన్ 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాష్ ఏటూరు, భారత ఎన్నికల సంఘం సెక్రటరీ నవీన్ మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కలంకారీ ఉత్తర్తులను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కలెక్టర్‌తో పాటు గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి జి. బాలసుబ్రహ్మణ్యం, విమానాశ్రయ సీఎస్‌వో కె. ధర్మేంద్ర, గన్నవరం మండల తహసీల్దార్ శివయ్య తదితర అధికారులు వారికి స్వాగతం పలికారు. అనంతరం ఎన్నికల సంఘం అధికారులు రోడ్డు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

భద్రతను, నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈస్ట్ కోస్టు రైల్వేలో రూ.270 కోట్ల వ్యయంతో 631 రూట్ కిలోమీటర్ల మేర కవచ్‌ను ఏర్పాటు చేసేందుకు భారతీయ రైల్వేల ఆమోదం

న్యూ ఢిల్లీ, జూన్ 22:దేశీయ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైల్వేల భద్రతను పెంపొందించడంలో భాగంగా.. ఈస్ట్ కోస్టు రైల్వేలో రూ. 270 కోట్ల వ్యయంతో 631 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి భారతీయ రైల్వే ఆమోదించింది.

ఈ ప్రాజెక్టు ద్వారా ఈస్టు కోస్టు రైల్వేలోని ఆరు ప్రధాన విభాగాలైన బఝుపాల్-బుధాపాంక్, హరిదాస్‌పూర్-పారదీప్, ఖుర్దా రోడ్ (కేయూఆర్)-బాలంగీర్, నౌపడ-గునుపూర్, లాంజీఘర్ రోడ్-జునాఘడ్, బొబ్బిలి-సాలూర్ సెక్షన్లలో కవచ్‌ను ఏర్పాటు చేస్తారు.

రైల్వే వ్యవస్థలో ఎల్‌టీఈ-ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థ తోడ్పాటుతో కవచ్‌ను విస్తరించేందుకు భారత్ రైల్వేలు చేపడుతున్న బృహత్ కార్యక్రమంలో మంజూరైన పనులు భాగంగా ఉన్నాయి. దేశీయంగా అభివృద్ధి చేసిన స్వయంచాలిత రైలు భద్రతా వ్యవస్థ (ఏటీపీ) కవచ్. ప్రమాదకర పరిస్థితుల్లో సిగ్నల్ దాటడాన్ని (ఎస్‌పీఏడీ), అధిక వేగాన్ని, రైళ్లు ఢీకొనడాన్ని నివారించి, భద్రతను పెంపొందించేలా దీనిని రూపొందించారు. రైళ్ల రాకపోకలను ఈ వ్యవస్థ నిరంతరం పర్యవేక్షిస్తుంది. అవసరమైన సందర్భాల్లో స్వయంచాలితంగా బ్రేకులు వేస్తుంది. దీనివల్ల భద్రత మరింత మెరుగవుతుంది.

ఈ మార్గాల్లో కవచ్‌ను ఏర్పాటు చేయడం వల్ల రైళ్లకు భద్రతను, ఒకదానితో మరొకటి ఢీకొట కుండా నివారించే సామర్థ్యాలను అందించడం ద్వారా రైలు కార్యకలాపాల్లో ఉన్నత స్థాయి రక్షణను సాధించడానికి సాధ్యమవుతుంది. వీటికి అదనంగా దట్టమైన పొగమంచు లాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం సురక్షితమైన, మరింత విశ్వసనీయమైన రైలు ప్రయాణాన్ని కవచ్ సాధ్యం చేస్తుంది. తద్వారా సేవల్లో విశ్వసనీయతను, సమయపాలనను మెరుగుపరుస్తుంది.

ఈస్టు కోస్టు రైల్వే పరిధిలోకి వచ్చే ఒడిశాతో పాటు పొరుగు ప్రాంతాల్లోని కీలకమైన సెక్షన్లలో ప్రయాణీకులు, సరకు రవాణా రైలు కార్యకలాపాలకు ఈ ప్రాజెక్టు లబ్ధి చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు.

2025లో నౌకల రీసైక్లింగ్‌లో అగ్రగామిగా నిలిచిన భారత్

న్యూ ఢిల్లీ, జూన్ 22:2025 నాటికి నౌకల రీసైక్లింగ్‌లో ప్రపంచంలోనే అగ్రగామిగా అవతరించిన భారత్, ప్రపంచస్థాయిలో తొలి స్థానంలో నిలిచింది. ఐక్యరాజ్యసమితి వాణిజ్య-అభివృద్ధి సదస్సు (యూఎన్‌సీటీఏడీ) తాజా నివేదిక ప్రకారం, ప్రపంచ నౌకా రీసైక్లింగ్‌లో 2024లో 30.1 శాతంగా ఉన్న భారత్ వాటా... 2025 నాటికి 35.4 శాతానికి పెరిగింది. దేశంలో నౌకల రీసైక్లింగ్ 2024లో 1.86 మిలియన్ జీటీ (జీటీ)గా ఉండగా, 2025 నాటికి దాదాపు 60 శాతం పెరిగి 2.99 మిలియన్ జీటీకి చేరుకుంది. ఈ విజయంతో, ప్రపంచంలోనే అగ్రగామి నౌకా రీసైక్లింగ్ దేశంగా నిలవాలన్న మారిటైమ్ ఇండియా విజన్-2030 లక్ష్యాన్ని భారత్ నిర్దేశిత గడువు కంటే ముందే సాధించింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారత ప్రభుత్వం చేపట్టిన నౌకా వాణిజ్య విధాన సంస్కరణలు, వ్యాపార నిర్వహణను సులభతరం చేసిన కార్యక్రమాల ప్రభావాన్ని ఈ విజయం ప్రతిబింబిస్తుంది.

ఈ సందర్భంగా కేంద్ర నౌకాశ్రయాలు, నౌకాయానం, జల రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో నిరంతర విధాన సంస్కరణలు, పరిశ్రమల కృషి, అంతర్జాతీయ పర్యావరణ, భద్రతా ప్రమాణాలను పాటించడం వంటి విజయాలకు నిదర్శనంగా భారత్ ప్రపంచంలోనే అగ్రగామి నౌకా రీసైక్లింగ్ దేశంగా ఆవిర్భవించింది. బాధ్యతాయుతమైన, సుస్థిరమైన నౌకా రీసైక్లింగ్‌లో ప్రపంచస్థాయి కేంద్రంగా భారత్ స్థానాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుంది" అని అన్నారు.

ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలు

భారత నౌకా రీసైక్లింగ్ వ్యవస్థ బలోపేతం, ప్రపంచ మార్కెట్‌లో అధిక వాటాను దక్కించుకోవడం లక్ష్యంగా నౌకాశ్రయాలు, నౌకాయానం, జల రవాణా మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలను చేపట్టింది:

హాంగ్ కాంగ్ సదస్సు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా...:

నౌకల సురక్షిత, పర్యావరణ అనుకూల రీసైక్లింగ్ కోసం హాంగ్ కాంగ్ అంతర్జాతీయ సదస్సు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నౌకల రీసైక్లింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం నౌకల రీసైక్లింగ్ చట్టం-2019ని అమలు చేసింది. ఈ చట్టాన్ని 2019లో భారత్ ఆమోదించింది.

నౌకల రీసైక్లింగ్ యార్డుల ఆధునికీకరణకు మద్దతుగా ప్రభుత్వం రూ.53.5 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించింది. దీంతో 115 కేంద్రాలు హెచ్‌కేసీ ప్రమాణాలకు అనుగుణంగా మారాయి.

షిప్-బ్రేకింగ్ క్రెడిట్ నోట్ పథకం:

ఎమ్‌వోపీఎస్‌డబ్ల్యూ ఈ 'షిప్-బ్రేకింగ్ క్రెడిట్ నోట్ స్కీమ్'ను ప్రారంభించింది. దీని కింద, రీసైకిల్ చేసిన నౌకల స్క్రాప్ విలువలో 40 శాతానికి సమానమైన క్రెడిట్ నోట్‌ను నౌకా యజమానులు పొందుతారు. ఈ క్రెడిట్ నోట్‌ను, భారతీయ షిప్‌యార్డ్‌లో నిర్మించే కొత్త నౌక విలువలో 5 శాతం వరకు చెల్లింపు కోసం ఉపయోగించుకోవచ్చు. తద్వారా ఇది నౌకల రీసైక్లింగ్, దేశీయ నౌకా నిర్మాణం రెండింటినీ ప్రోత్సహిస్తుంది.

వాటాదారుల భాగస్వామ్యం:

సవాళ్లను గుర్తించి, సంబంధిత పరిష్కారాలను అమలు చేయడానికి గుజరాత్ మారిటైమ్ బోర్డ్, షిప్ రీసైక్లింగ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్, గ్లోబల్ షిప్పింగ్ కంపెనీలు, క్యాష్ బయ్యర్లు, క్లాసిఫికేషన్ సొసైటీలు, అంతర్జాతీయ సంస్థలతో ఎమ్‌వోపీఎస్‌డబ్ల్యూ నిరంతర సంప్రదింపులు జరుపుతుంది.

యూరోపియన్ యూనియన్ నౌకా రీసైక్లింగ్ నిబంధనలతో సమీకృతం:

యూరోపియన్ యూనియన్ ఆమోదించిన రీసైక్లింగ్ కేంద్రాల జాబితాలో భారతీయ షిప్ రీసైక్లింగ్ యార్డులను చేర్చడానికి భారత ప్రభుత్వం చురుగ్గా కృషి చేస్తోంది. ఆమోదాలను సులభతరం చేయడానికి సంబంధిత అధికారులతో నిరంతర సంప్రదింపులు జరుగుతున్నాయి.

అలాంగ్ షిప్ రీసైక్లింగ్ యార్డ్ విస్తరణ:

ఆలాంగ్ షిప్ రీసైక్లింగ్ యార్డ్ ప్రణాళికాబద్ధమైన విస్తరణ ద్వారా, భారత్ తన నౌకా రీసైక్లింగ్ సామర్థ్యాన్ని దాదాపు 9 మిలియన్ లైట్ డిస్‌ప్లేస్‌మెంట్ టన్నులకు (ఎల్‌డీటీలకు) పెంచడం ద్వారా దానిని రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. భవిష్యత్ డిమాండ్‌కు మద్దతునివ్వడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, ప్రపంచ మార్కెట్‌లో భారత్ పోటీతత్వాన్ని పెంపొందించడానికి గుజరాత్ ప్రభుత్వం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసింది.

బలమైన వృద్ధికి అవకాశాలు

బాల్టిక్, అంతర్జాతీయ నౌకా వాణిజ్య మండలి ప్రకారం... రాబోయే దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా 16,000 కంటే ఎక్కువ నౌకలను రీసైకిల్ చేయనున్నట్లు అంచనా. ప్రస్తుతం 35.4 శాతం మార్కెట్ వాటాతో, భారత్ తన నౌకా రీసైక్లింగ్ సామర్థ్యాన్ని విస్తరిస్తూనే, ప్రతియేటా సుమారు 500 నుంచి 600 నౌకలను రీసైకిల్ చేయడానికి అనువైన స్థితిలో ఉంది.

నౌకా రీసైక్లింగ్ భవిత సుస్థిరం

ప్రపంచ నౌకా రీసైక్లింగ్‌లో భారత్ అగ్రస్థానానికి ఎదగడం... సుస్థిరత, నియంత్రణ సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశ్రమల సహకారాలపై దృష్టి సారించిన సమన్వయ వ్యూహాల ఫలితం. భవిష్యత్తు కోసం బలమైన డిమాండ్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారడంలో వృద్ధి, నిరంతర ప్రభుత్వ మద్దతు, సర్క్యులర్ ఎకానమీ, సుస్థిర నౌకా వాణిజ్య అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్తూనే... నౌకా రీసైక్లింగ్‌లో తన అగ్రస్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి భారత్ పూర్తి సన్నద్ధతతో ఉంది.

ట్రాఫిక్ బాధ్యత ఆటో డ్రైవర్లదే

-పుట్టపర్తి సీఐ యువరాజు

అమరావతి, జూన్ 23: ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పుట్టపర్తి పట్టణ సీఐ యువరాజు సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, ప్రయాణికులకు మెరుగైన సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ యువరాజు మాట్లాడుతూ.. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తికి దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని, వారికి సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్ లపై ఉందన్నారు. డ్రైవర్ల ప్రవర్తన కూడా పుట్టపర్తి ప్రతిష్టను ప్రతిబింబిస్తుందని గుర్తు చేశారు.

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలిపివేయడం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గణేష్ గేట్, గోపురం గేట్ ప్రాంతాల్లో ఆటోలను నిలపరాదని, కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలు నిలపాలని సూచించారు.

ప్రతి ఆటోలో క్యూఆర్ కోడ్, డ్రైవర్ వివరాలు, వాహనానికి సంబంధించిన అవసరమైన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, విదేశాల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆటో డ్రైవర్లు కృషి చేయాలని సూచిం చారు.

అలాగే గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ రాజకుల్లాయప్ప, ఈగల్ ఎస్ఐ శ్రీహరి, పోలీసు సిబ్బంది, సుమారు 150 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లోకి నాణ్యమైన విత్తనాలు.. ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి

కరీంనగర్, జూన్ 23:: రైతులకు అందుబాటులో ఉండేందుకు వారి ముంగిట్లోకే నాణ్యమైన విత్తనాలను అందజేస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మానకొండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీధర్, సింగిల్ విండో చైర్మన్ జంగా రమణారెడ్డి అన్నారు. చిగురుమామిడి మండలంలోని సుందరగిరి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు వేదికలలో విత్తనాల మేళా.. రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాన్ని సర్పంచ్ జంగ శిరీష అధ్యక్షతన నిర్వహించారు.

అనంతరం వారు ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతూ ఈనెల 23 నుండి 30 వరకు ప్రతీ రైతు వేదికలో రైతులకు ఖరీఫ్ సీజన్లో కావలసిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ విత్తన మేళాలో సన్నవడ్లు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలు, నానో యూరియా, నానో డిఏపీలు రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. వ్యవసాయ పంటలపై సూచనలు సలహాలు కావాలంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగ శిరీష, మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రాకేష్, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై బట్ట కప్పి.. గర్భగుడి తాళాలు పగులగొట్టి.. బాసర ఆలయంలో చోరీ

నిర్మల్, జూన్ 23: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో భారీ చోరీ జరిగింది. సరస్వతి అమ్మవారి ఆలయం లోని పై అంతస్తులో ఉన్న మహాంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది.

మంగళవారం తెల్లవారు జామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.

కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయం లోకి ప్రవేశించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. చోరీకి పాల్పడిన హుండీలో నుంచి డబ్బులు తీసుకుని, తర్వాత హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లుగా పోలీసులు గుర్తించారు. బాసర ఆలయంలో చోరీ గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఘటనాస్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన తీరు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు. కేసును అన్ని కోణాల్లో విచారించి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సినిమాటోగ్రాఫర్‌కి కీలక బాధ్యత ఇచ్చిన విజయ్.. ఎమోషనల్ పోస్ట్‌తో పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు

తమిళనాడు, జూన్ 23: తమిళనాడు ప్రభుత్వం ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంసకు ప్రతిష్టాత్మక బాధ్యతలను అప్పగించింది. తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్‌గా ఆయనను నియమిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ నియామకం సినీ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. తాజాగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మనోజ్ పరమహంస, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ జన్మదినం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా భావోద్వేగపూరిత పోస్టును పంచుకున్నారు. తనపై నమ్మకం ఉంచి ఇంతటి బాధ్యతను అప్పగించినందుకు ముఖ్యమంత్రి విజయ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

తన పోస్టులో మనోజ్ పరమహంస మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మీకు వ్యక్తిగతంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసేవాడిని. కానీ ఈ ఏడాది ప్రత్యేకమైనది.

నన్ను ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్‌గా నియమించి ఒక గొప్ప బాధ్యతను అప్పగించారు. ఈ అవకాశాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను అని పేర్కొన్నారు. అలాగే అంకితభావంతో, నిజాయితీతో సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ఫిల్మ్ ఇండస్ట్రీకి, విద్యాసంస్థకు మధ్య బలమైన సాంకేతిక వారధిని నిర్మించడం, ఎంజీఆర్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడం తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

మనోజ్ పరమహంస నియామకంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా స్పందించారు.

ఆయనకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలియజేశారు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు సేవలందించిన ప్రతిభావంతుడైన ఛాయాగ్రాహకుడు మనోజ్ పరమహంస ఈ బాధ్యతలకు పూర్తిగా అర్హుడు.

ఆయన నాయకత్వంలో మరెంతో మంది ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు తయారవుతారని ఆశిస్తున్నాను అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

కాగా, మనోజ్ పరమహంసకు తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. విజయ్ నటించిన 'స్నేహితుడు', 'బీస్ట్', 'లియో' వంటి చిత్రాలకు ఆయన సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు.

ఈ సినిమాల విజయంలో ఆయన విజువల్ వర్క్ కీలక పాత్ర పోషించింది.అలాగే తెలుగులో 'ఏ మాయ చేసావే', 'రేసుగుర్రం', 'కిక్ 2', 'బ్రూస్ లీ', 'రాధేశ్యామ్', 'గుంటూరు కారం' వంటి చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా సేవలందించారు.

పవన్ కళ్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు', 'ఓజీ' చిత్రాలకు కూడా ఆయన పనిచేసారు.

సుజనా ఫౌండేషన్ సహకారంతో భారీ ఉచిత మెడికల్ క్యాంపు ప్రారంభం..

-మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్

అమరావతి, జూన్ 23: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ ఉచిత మెడికల్ క్యాంపును శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం పెనుగంచిప్రోలు పాత సినిమా హాల్ సెంటర్‌లోని ఆర్.కే. ఫంక్షన్ హాల్‌లో రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపులో ఏర్పాటు చేసిన వివిధ వైద్య విభాగాలను పరిశీలించి, వైద్య బృందం అందిస్తున్న సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, పరీక్షల నిర్వహణ విధానం, వైద్య నిపుణుల సేవలపై వైద్యులతో చర్చించారు.

ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు ఈసీజీ, 2డి , రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు తదితర సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. అలాగే అవసరమైన వారికి వైద్య నిపుణుల సూచనలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడానికి ఈ క్యాంపు మంచి అవకాశంగా నిలుస్తోంది.

పేద మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెద్ద వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు.సుజనా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుజనా చౌదరి సామాజిక బాధ్యతతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

గతంలో కూడా సుజనా ఫౌండేషన్ ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులకు వర్షాల సమయంలో పంటలు దెబ్బతినకుండా రక్షించేందుకు పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు.

విద్య, వైద్యం, రైతు సంక్షేమం వంటి అనేక రంగాల్లో ఫౌండేషన్ చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని కొనియాడారు.

కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

క్యాంపుకు వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో వైద్య సేవలను వినియోగించుకోవడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చింతల సీతారామయ్య, జిల్లేపల్లి సుధీర్ బాబు, గజ్జి కృష్ణమూర్తి, కాకాని బ్రహ్మం, కొత్తపల్లి నతీష్, నల్లపునేని కొండ, ఏవూరి నాగశ్రీను, యనమదల నరసింహారావు, కొల్లిపాక బ్రహ్మం, దుడ్ల వినయ్, దివ్వెల వంశీ రమేష్ హాస్పిటల్స్ సిబ్బంది, సుజనా ఫౌండేషన్ సీఈఓ సుధా ఉపాధ్యాయుల, సుజనా ఫౌండేషన్ హెడ్ ఆపరేషన్స్ వీరమాచినేని కిరణ్, మెడికల్ ఇన్చార్జ్ వెంకటరమణ, సుజనా ఫౌండేషన్ ఇంచార్జ్ హరీష్, శంకర్ నేత్రాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య..

-కలెక్టర్, ఎస్పీలకు వినతి

మెదక్, జూన్ 23:ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారదులుగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు జరపడం హేయమైన చర్య అని జర్నలిస్టు సంఘాల నేతలు పేర్కొన్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండలంలో ఓ విలేకరి పై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం బాధితునితో కలిసి మెదక్ జిల్లా జర్నలిస్టులు కలెక్టరేట్లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ యూనిస్, జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావులకు వేర్వేరుగా వినతి పత్రాలను సమర్పించారు.

ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నేతలు మాట్లాడుతూ నార్సింగ్ మండలంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసిన అంశంపై వార్త ప్రచురించిన విలేకరి రాఘవేందర్‌పై కొందరు దాడికి పాల్పడినట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా గుర్తింపు పొందిందని, సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వృత్తిలో భాగంగా వార్త కథనాలు ప్రచురిస్తే మీడియా ప్రతినిధుల పై దాడులు జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటువంటి దాడులు జర్నలిస్టుల్లో భయాందోళనలు కలిగించడమే కాకుండా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ప్రమాదం ఉందన్నారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించా రు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, టీయూడబ్ల్యూజె (143) జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, రాజశేఖర్, తిమ్మన్నగారి శ్రీధర్, నాగరాజు శర్మ, ఫారుక్ హుస్సేన్, బొందుగుల మువ్వ నవీన్, గోపాల్ గౌడ్, కామాటి కృష్ణ, నీలం, సందీప్, శ్రీనివాస్, శ్రీనివాస్ చారి, గోవర్ధన్ రెడ్డి, లక్ష్మినారాయణ, ఖయ్యుమ్, చల్ల రాహుల్, రాఘవులు, మల్లేష్, కార్తీక్, శ్రీహరి, సంగమేష్, రహమాత్ తో పాటు పాల్గొన్నారు.

తెలుగు కథకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన పాలగుమ్మి



జూన్ 24... పాలగుమ్మి పద్మరాజు జయంతి

తెలుగు కథా సాహిత్యంలోప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు. అయన తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించారు. పాలగుమ్మి పద్మరాజు 1915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. విద్యాభ్యాసం స్వస్థలం లోనూ, ఇతర ప్రాంతాలలోనూ పూర్తి చేసుకున్న ఆయన 1939వ సంవత్సరం నుండి 1952 వరకు కాకినాడలోని పీ.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా విధులు నిర్వహించారు.

తన పంతొమ్మిదో యేట నుంచే రచనలు మొదలు పెట్టారు. మొదట ఛందోబద్ధంగా పద్యాలు రాసి తర్వాత వచనంలోకి వచ్చారు.

పాలగుమ్మి పద్మరాజు తన సాహిత్య జీవన యానంలో 60 కథలు, ఎనిమిది నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు మరియు నాటకాలను రచించారు. ఆయన రాసిన 60 కథలలో గాలివాన, పడవ ప్రయాణం, ఎదురు చూసిన ముహూర్తం అనే మూడు సంపుటాలుగా వెలువడ్డాయి.

తెలుగు మీద ఎంత పట్టు ఉందో ఇంగ్లిష్ మీద కూడా అంతే అధికారం ఉంది. అందుకే తాను రాసిన కథానికలను తానే ఆంగ్లంలోకి తర్జుమా చేసుకునే వారు. ఆ క్రమంలోనే 1958లో అంతర్జాతీయ కథానికల పోటీలో 'గాలివాన' కథ రాసి పంపితే బహుమతి వచ్చింది.

"గాలివాన" తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మికే చెందుతుంది. ఈ కథను ప్రపంచంలోని అనేక బాషలలోకి అనువదించారంటే ఆ నవల సాహితీ ప్రపంచంలో ఎంతగా పేరు తెచ్చుకుందో అర్థం అవుతుంది. అయన మొదటి కథ "సుబ్బి". ఎన్నో కథలు రాసినప్పటికీ వాటిలో ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చిన కథ "గాలివాన" మాత్రమే. ఈ కథ 1952వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని "హెరాల్డ్ ట్రిబ్యూన్"వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలలో రెండువ బహుమతిని గెలుచుకుంది.

ఈ పోటీలకు మొత్తం 23 దేశాల నుంచి 59 కథలు ఎంపికకాగా, అందులో భారత దేశం నుంచి మూడు కథలు ఎంపికవగా.. అందులో గాలివాన ఒకటి.

అలా తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్ర లో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఆయన రాసిన నవలలో బతికిన కాలేజీ, నల్లరేగడి, రామ రాజ్యానికి రహదారి, రెండో అశోకుడి మూన్నాళ్ల పాలన మొదలైన రచనలు ముఖ్యమైనవి.

ఆయన రాసిన కవితలు, పద్యాలు, పాటలు, కథానికలు, నవలలు. రేడియో నాటకాల గురించి అందరికీ తెలిసినా సినిమా రచనల గురించి చాలా మందికి తెలియదు. ఆయన సినిమా ప్రవేశం కృష్ణశాస్త్రి ద్వారా జరిగింది.

నాటికే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమాలకు పాటలు రాస్తున్నారు. బిఎన్‌రెడ్డి సినిమా తీయాల నుకున్న సంగతి తెలిసి పద్మరాజుకు కబురు చేస్తే మద్రాసు వెళ్లారు. 1954వ సంవత్సరంలో ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత బొమ్మెండ్ల నరసింహారెడ్డి, తాను వాహినీ పతాకం కింద నిర్మించిన "బంగారు పాప" అనే చిత్రానికి మాటలు రాయమని పద్మరాజును కోరారు. అప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక సినిమాలకు కథలు, పాటలు పాల గుమ్మి కలంనుంచి జాలువారాయి. 'బంగారు పాప' సినిమాలో కోటయ్య పాత్ర ఎస్‌వి రంగారావుకు చాలా పేరు వచ్చింది. 'ఇటు వంటి పాత్ర మళ్లీ నాకు దొరకలేదు' అని ఎన్నోసార్లు చాలామందితో సంబరంగా అనేవారట. ఆ తరవాత 'రంగుల రాట్నం' చిత్రానికి కథ మాటలు రాశారు. ఆ కథకు నంది అవార్డు వచ్చింది. రంగుల రాట్నం నటుడు చంద్రమోహన్ పాత్రకు ప్రాణం పోసి, ఆయనను చిత్ర సీమలో నిలబెట్టింది. తర్వాత భావ నారాయణ తీసిన 'గోపాలుడు భూపాలుడు' జానపద చిత్రానికి కథ, మాటలు అందించారు. మురారి నిర్మాణంలో వచ్చిన 'సీతామాలక్ష్మి' చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. సినిమా అంటే అవగాహన ఉండి పాటలు, మాటలు, కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, సంగీతం,.. అన్ని శాఖల లోనూ పని చేశారు. దేవుడిచ్చిన భర్త, బికారి రాముడు... చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తం 30కి పైగా సినిమాలకు పని చేశారు. ఎడిటింగ్, ప్రాసెసింగ్, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ దాకా అన్నీ చూసి నేర్చుకున్నారు. శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ సినిమాకు పాటలు రాయడానికి కృష్ణశాస్త్రి రావడం కొంచెం ఆలస్యం అయితే పద్మరాజు తో ఒక పాట రాయించారు, అదే 'రాకోయీ అనకోని అతిథి'. అంతకు ముందే 'భక్త ప్రహ్లాద' చిత్రానికి 'జననీ వర దాయనీ భవానీ' అనే గీతం కూడా రచించారు.

దాసరిగారితో చాలా సినిమాలు చేశారు. దాసరి, పద్మరాజును 'మా గురువు గారు' అనే వారు. దాసరి, పద్మరాజు వద్ద రైటర్‌గా పని చేశారు. దాసరి ఒకేసారి నాలుగైదు సినిమాలు తీయడం వల్ల పద్మరాజు సలహాలను ఎక్కువగా అడిగేవారు.

తరువాత భక్త శబరి, బంగారు పంజరం లాంటి అనేక సినిమాలలో పాలగుమ్మి పనిచేసినా... తన సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, వ్యాపారపరంగా నష్టాలను చవి చూశాయి. పాలగుమ్మి దర్శకుడిగా "బికారి రాముడు" అనే సినిమాను తీసినా అది కూడా విజయవంతం కాలేదు.

ఆ తరువాత పాలగుమ్మి నవల "నల్లరేగడి"ని "మాఊరి కథ" అనే పేరుతోనూ, "పడవ ప్రయాణం" అనే కథను "స్త్రీ" పేరు తోనూ సినిమాలు తీశారు. సాహితీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన అచ్చ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1983 ఫిబ్రవరి 27న మరణించారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

బదిలీపై వెళ్లిన కార్యదర్శికి ఘనంగా సన్మానం..

నల్గొండ, జూన్ 23:బాల్కొండ నియోజకవర్గం లోని భీమ్‌గల్ మండలంలోని చేంగల్ గ్రామ పంచాయతీ సెక్రెటరీగా ప్రదీప్ బదిలీపై వెళ్లడం జరిగిందని గ్రామ సర్పంచ్ దుమాల మమత రాజు అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయత్ కార్యదర్శి ప్రదీప్ గత ఆరు సంవత్సరాలు ఎనలేని సేవలు అందించి గ్రామ ప్రజల మన్ననలు పొంది మంచి పేరు తెచ్చుకోవడం జరిగింది.

గత పది రోజుల క్రితం బదిలీపై వేల్పూర్ మండలం కొత్త పల్లికి బదిలీపై వెళ్లడంతో మంగళవారం పంచాయత్ కార్యదర్శి ప్రదీప్ ను చేంగల్ గ్రామ పంచాయతీకి ఆహ్వానించి ఘనంగా శాలువ పూలమాలతో సన్మానించి గ్రామ దేవుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపిక తో అభినందించారు. అలాగే నూతన బాధ్యతలు తీసుకున్న సెక్రటరీగా వచ్చిన వినయ్ కి గ్రామ సర్పంచ్ దుమాల మమత, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు,ఉపసర్పంచ్ నాతి మోహన్ గౌడ్, అభినందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో నూతుల ప్రమీల, పురస్తు గోదావరి, బాయి పావని,నరేష్, గుండారం రజిత, రవి, గుమ్మెర్ల రవళి, సురేష్, పురస్తు దిలీప్, గోలి గంగారం, గుమ్మెర్ల గంగారం, మాడవేని అశోక్, మంద గంగాధర్, తక్కురి నికేష్, కారోబార్ చందు, గ్రామ పంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో సంప్రోక్షణ పూజలు..



బాసర, జూన్ 23:: బాసర పుణ్యక్షేత్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి ఉప ఆలయమైన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఇటీవల చోటుచేసుకున్న చోరీ ఘటన అనంతరం ఆలయ వైదిక సిబ్బంది, వేద పండితులు మంగళవారం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారి కిరీటం, హుండీని గుర్తుతెలియని దుండగులు పగులగొట్టి నగదు అపహరించిన నేపథ్యంలో ఆలయాన్ని గంగాజలంతో శుద్ధి చేసి సంప్రోక్షణ చేపట్టారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్ ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారికి హారతులు ఇచ్చి, నైవేద్యం సమర్పించి భక్తుల శాంతి, క్షేమాల కోసం ప్రార్థనలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనీదేవి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఐఐఐటీ శ్రీకాకుళంలో అడ్మిషన్ల సందడి..

-రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థుల రాకతో క్యాంపస్‌లో సందడి

అమరావతి, జూన్ 23:రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) పరిధిలోని ఐఐఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సు ప్రవేశాల కౌన్సిలింగ్ మంగళవారం ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో క్యాంపస్ ప్రాంగణం సందడిగా మారింది.

కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థుల కోసం అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ముందుగా టోకెన్లు కేటాయించి లోపలికి అనుమతించిన అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన, కుల ధృవీకరణ పత్రాల తనిఖీ, ఆన్‌లైన్ ఫీజుల చెల్లింపు ప్రక్రియలను పూర్తి చేసి అడ్మిషన్లు కల్పించారు. శ్రీకాకుళం క్యాంపస్‌లో తొలి అడ్మిషన్‌ను పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం కాశీపట్నానికి చెందిన వి. ప్రీతి దక్కించుకోగా, అనకాపల్లి జిల్లాకు చెందిన సి.హెచ్. దీక్షిత్ ధర్మతేజ రెండో అడ్మిషన్ పొందారు. వీరికి వర్సిటీ డైరెక్టర్ గిరిధర్ మద్రాసు అడ్మిషన్ పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా అడ్మిషన్ల కన్వీనర్, రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ, శ్రీకాకుళం క్యాంపస్‌లోని సీట్ల భర్తీ కోసం రెండు రోజుల పాటు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజున 500 మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ పూర్తి చేశామని, బుధవారం మరో 500 మందికి కౌన్సిలింగ్ నిర్వహించడంతో ఈ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో క్యాంపస్ పరిపాలనా అధికారి డా. ముని రామకృష్ణ, డీన్ డా. శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డా. వాసు, వెల్ఫేర్ డీన్లు ప్రకాశరావు, యోగేశ్వరి, వివిధ విభాగాల కో-ఆర్డినేటర్లు, సిబ్బంది, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి అమానుషం

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి: టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు

మేడ్చల్, జూన్ 23: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసిన అంశంపై వార్త ప్రచురించిన మన తెలంగాణ విలేకరి రాఘవేంద్రపై జరిగిన దాడిని టీయూడబ్ల్యూజే (ఐజేయు) మండల అధ్యక్షుడు మహమ్మద్ అజ్గర్ తీవ్రంగా ఖండించారు.

ఈ ఘటనకు సంబంధించి మంగళవారం జర్నలిస్టు యూనియన్ నాయకులతో కలిసి నిజాంపేట పోలీస్ స్టేషన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్య అని అన్నారు.

నిజాలను నిర్భయంగా రాసే విలేకరుల గొంతు నొక్కేందుకు చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పోలీసులు కాలయాపన చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ సభ్యులు జీడీ చంద్రకాంత్ గౌడ్, బండారి సిద్ధరాములు, పప్పుల భరత్ రెడ్డి, కుర్మా బాల్‌రాజ్, శ్రీకాంత్, చంద్రశేఖర్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జామా మసీదు నిర్మాణానికి నిధులు ఇవ్వాలి

- మైనార్టీ మంత్రికి జామా మసీదు కమిటీ సభ్యుల వినతి

రాజన్న సిరిసిల్ల, జూన్ 23: (నేటినిజం ప్రతినిధి): :వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో ఉన్న జామా మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి అవసరమైన అనుమతులు కల్పించాలని కోరుతూ జామా మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు మైనార్టీ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ను సచివాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచన మేరకు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రతినిధులు జామా మసీదు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అనంతరం మంత్రికి శాలువాతో సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామా మసీదు అధ్యక్షుడు నవాబ్ ఖాన్, ఉపాధ్యక్షుడు మొహ్సిన్, కోశాధికారి సయ్యద్ షబ్బీర్, నాయకుడు అబ్దుల్ రజాక్, సచివాలయ ఉద్యోగి ఆరిఫ్, సోయెల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కుంభకోణంపై విచారణ జరపాలి..

- రైతులకు పరిహారం చెల్లించాలి- కొనరావుపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

రాజన్న సిరిసిల్ల, జూన్ 23: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే మండలంలో వెలుగుచూసిన వడ్ల కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభకోణం కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సాహితీ కిరణం ఆధ్వర్యంలో ప్రపంచరికార్డులు సాధించిన శ్రీ త్యాగరాయ గానసభ
సాహితీ కిరణం 17వ వార్షికోత్సవ వేడుకలు
ముఖ్య అతిథి : డా॥ కె.వి.రమణ ఐ.ఎ.ఎస్ (ర)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు- నేటినిజం
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్.జనార్దనమూర్తి
అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ
ఆత్మీయ అతిథి : డా॥వై.రామకృష్ణారావు
సాహితీవేత్త
ప్రత్యేక అతిథి : శిరోమణి డా॥వంశీ రామరాజు
వంశీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు
సభాప్రారంభకులు : శ్రీ పాత్తూరి సుబ్బారావు
సంపాదకులు - సాహితీకిరణం
కార్యక్రమ నిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
సలహాదారులు - సాహితీకిరణం
శ్రీమతి పింగళి కమలాకేసరి నెలకొల్పిన డా॥పింగళి జగన్నాథరావు స్మారక సాహిత్య పురస్కారం-2026 స్వీకర్త డా॥ ఎస్.గోపి సాహితీవేత్త తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు
శ్రీ సిరిగాద శంకర్ నెలకొల్పిన శ్రీ సిరిగాద సర్వయ్య స్మారక సాహిత్య పురస్కారం-2026 స్వీకర్త డా॥ వైరాగ్యం ప్రభాకర్ కవి,రచయిత
శ్రీమతి సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్యపురస్కారం-2026 స్వీకర్త శ్రీమతి సి.వి.ఆర్.మాణిక్యేశ్వరి సినీ వ్యాసరచయిత్రి
సాంస్కృతిక కార్యక్రమం
కోమల సమన్విత కూచిపూడి నృత్యాలయం వారి కూచిపూడి నృత్య ప్రదర్శన
తేది:24.06.2026 బుధవారం సా॥6.00గం॥లకు - వేదిక : శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదిక , చిక్కడపల్లి, హైదరాబాద్
శ్రీ త్యాగరాయ గానసభ శ్రీమతి కళాతారదా దీక్షితులు ప్రధాన కార్యదర్శి
సాహితీకిరణం శ్రీమతి పి.జయలక్ష్మి - మేనేజర్ లయన్ వి.వి.రాఘవరెడ్డి - సలహాదారులు

ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

- బీజేపీ నాయకుల ఘన నివాళి



రాజన్న సిరిసిల్ల, జూన్ 23: (నేటినిజం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించి దేశంలో రాజకీయ చైతన్యానికి పునాది వేసిన మహానుభావుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. దేశ సమైక్యత కోసం పోరాడిన ఆయన జైల్లోనే తుదిశ్వాస విడిచారని, ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి ఏడాది బీజేపీ బలిదాన్ దివస్ నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, ఒకే దేశం అనే భావనతో దేశ సమగ్రత కోసం పనిచేసిన ముఖర్జీ ఆశయాలను బీజేపీ కొనసాగిస్తోందన్నారు. ఆయన చూపిన మార్గదర్శకత్వంతోనే బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, రాష్ట్ర నాయకులు రేగుల రాజు, కోల కృష్ణస్వామి, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్లు వంగల శ్రీను, కండ్లేపు ముత్యం, మైలారం శ్రీనివాస్, నాయకులు పిన్నింటి హనుమాన్లు, బోనాల శివ, మామిళ్ల లక్ష్మీరాజం, బిల్లా కృష్ణ, కటకం శ్రీనివాస్, జవ్వజి శేఖర్, అన్నం నరసయ్య, కుమ్మరి నరేష్, చిక్కుడు మల్లేశం, రఘుపతి, నగ్గు రాహుల్, పోతారం సాయి, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.